ప్రజాశక్తి

బుధవారం 29 మార్చి 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

జి 20 సందడి

◆ విశాఖలో ఘనంగా ఐడబ్ల్యుజి సమావేశాలు ప్రారంభం
◆ తొలి రోజు 'రేపటి ఆర్థిక నగరాల నమూనా ఎలా ఉండాలి?' అన్న అంశంపై చర్చ
◆ గాలా డిన్నర్‌లో పాల్గొన్న సిఎం జగన్ ◆ విదేశీ ప్రతినిధుల రాకతో నగరంలో హై అలర్ట్



సదస్సులో మాట్లాడుతున్న సిఎం జగన్మోహన్ రెడ్డి



తొలి రోజు చర్చల్లో పాల్గొన్న జి 20 దేశాల ప్రతినిధులు



నృత్యాలతో ఆకట్టుకున్న కళాకారులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, ఎంవిపి.కాలనీ

విశాఖ నగరంలో జి - 20 దేశాల సందడి నెలకొంది. దేశ, విదేశీ ప్రతినిధులు తరలివచ్చారు. వారికి ఎపి ప్రభుత్వం ఘన స్వాగతం పలికింది. సిఎం జగన్ రాక, విదేశీ ప్రతినిధులతో భేటీ, అనంతరం గాలా డిన్నర్ వంటి కార్యక్రమాలతో విశాఖలో సరికొత్త వాతావరణం అలుముకుంది.

ప్రతిష్టాత్మకంగా మూడు రోజులు పాటు తలపెట్టిన జి - 20 దేశాల ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్కింగ్ గ్రూప్ - 2 (ఐడబ్ల్యుజి) సమావేశాలు మంగళవారం విశాఖ సాగర్‌నగర్‌లోని రాడిసన్ బ్లూ హోటల్‌లో ఘనంగా ప్రారంభ మయ్యాయి. తొలి రోజు 'రేపటి ఆర్థిక నగరాల నమూనా ఎలా ఉండాలి?' అన్న అంశంపై సుదీర్ఘంగా సభ్యుల్లో డిబేట్ జరిగింది. జి-20 దేశాల్లో 14 దేశాలకు చెందిన 57 మంది, అతిథి దేశాలకు చెందిన 8 మంది ప్రతినిధులు చర్చలో పాల్గొన్నారు. 10 ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్లు ఈ చర్చలో భాగస్వాములయ్యాయి. పట్టణాలు, నగరాల్లో ఆర్థికపరమైన ప్రాజెక్టులు, నిధుల కేటాయింపులు, ప్రాధాన్యతలపై డ్రాఫ్ట ముసాయిదాను సమావేశంలో ప్రవేశపెట్టారు. దీనిపై సభ్యులంతా చర్చలు జరిపారు. పన్నుల విధానంపై 13 మంది అంతర్జాతీయ నిపుణులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. సదస్సు నేపథ్యంలో విశాఖలో హై అలర్ట్ నెలకొంది. ఎక్కడ చూసినా పోలీసులే కనిపించారు. ఎయిర్‌పోర్టు నుంచి సాగర్ నగర్ వరకూ ఉన్న అన్ని ప్రాంతాలూ పోలీసు వలయంలో ఉన్నాయి.

జి 20 ప్రతినిధులతో సిఎం జగన్ భేటీ

వివిధ దేశాల ప్రతినిధులతో సాయంత్రం వేళ సిఎం భేటీ అయ్యారు. తమ ప్రభుత్వం ఎపిలో అధికారంలోకి వచ్చాక 30 లక్షల మందికి ఇళ్లపట్టాలు ఇచ్చిందన్నారు. 22 లక్షల ఇళ్లు కడుతున్నట్టు చెప్పారు. ఈ క్రమంలో తమకు మిగతా 2లో..

బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చడం దారుణం

▶ వార్త 2లో..

స్కూలు ఫీజులు తగ్గించాలని ధర్నా

▶ వార్త 2లో..

ప్రభుత్వ భూమిని కాజేయడానికి కుట్ర ?

▶ వార్త 6లో..

ఆత్మహత్య వీడియో కలకలం

◆ మరణిస్తున్నామంటూ కనిపించకుండా వెళ్లిపోయిన దంపతులు
◆ కొప్పాక ఏలేరు కాలువ వద్ద వాహనం, చెప్పులు
◆ ముమ్మరంగా గాలిస్తున్న గజ ఈతగాళ్లు
◆ ఆర్థిక కష్టాలే దంపతుల నిర్ణయానికి కారణమా ?






ఏలేరు కాలువలో గాలిస్తున్న ఈతగాళ్లు, ఇన్‌సెట్‌లో దంపతులు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - ఉక్కునగరం, అనకాపల్లి : వడ్లపూడి పరిధి తిరుమల నగర్‌కి చెందిన ఉక్కు ఉద్యోగి వరప్రసాద్ దంపతులు ఆత్మహత్య చేసుకుంటున్నామంటూ సెల్ఫీ వీడియో తీసుకుని బంధువులకు పంపించి అకస్మాత్తుగా కనిపించకుండా పోయారు. ఆ వీడియో చూసిన వరప్రసాద్ పిల్లలతో పాటు బంధువులు తీవ్ర ఆందోళన చెందారు. ఈ వీడియో సోషల్ మీడియాలోనూ వైరల్ అయింది. దీంతో ఆ ప్రాంతంలో కలకలం రేగింది. విశాఖలో మంగళవారం ఏ మూల చూసినా ఈ ఘటన గురించే చర్చ సాగింది. వరప్రసాద్ కుమారుడు సాయి తేజ దువ్వాడ పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది. సెల్ఫీ వీడియోలో మిగతా 2లో..

పోలవరంపై కేంద్రం నిర్లక్ష్యం తగదు

◆ తక్షణం పనులు పూర్తి చేసి జాతికి అంకితమివ్వాలి
◆ నిర్వాసితులకు న్యాయం చేయాలి
◆ అఖిలపక్ష రాజకీయ పార్టీల చర్చాగోష్టిలో నేతలు డిమాండ్



చర్చాగోష్టిలో పాల్గొన్న రాజకీయ పార్టీల నేతలు

ప్రజాశక్తి - సీతమ్మధార : ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడి వంటి పోలవరం జాతీయ ప్రాజెక్టు భవితవ్యం అగమ్యగోచరంగా తయారైందని, రాష్ట్ర విభజన చట్టం ప్రకారం ఆ ప్రాజెక్టును కేంద్రమే నిర్మించి జాతికి అంకితం ఇవ్వాలని రాజకీయ పార్టీల నేతలు డిమాండ్ చేశారు. 'పోలవరం నిర్మాణం చేపట్టి ఉత్తరాంధ్రకు న్యాయం చేయాలి' అంటూ ద్వారకా నగర్ పౌర గ్రంథాలయంలో రాజకీయ పార్టీల చర్చా గోష్టి మంగళవారం జరిగింది. టిడిపి, సిపిఎం, సిపిఐ, జనసేన, కాంగ్రెస్, లోక్‌సత్తా, ఆప్ పార్టీల నేతలు పాల్గొన్నారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణ మూర్తి ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రాజెక్టులు పునాది రాళ్లకే పరిమితమయ్యాయని, గతంలో పూర్తయిన ప్రాజెక్టులకు సంబంధించి ఇప్పటికీ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని పేర్కొన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తయి దశాబ్దాలు గడిచినా నిర్వాసితులకు నేటికీ పరిహారం అందలేదన్నారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి అరకొర నిర్మాణాలు తప్ప అక్కడా జరిగిందేమీ లేదన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ పోలవరంపై కేంద్రం చేతులెత్తేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూడటం దారుణమన్నారు. డ్యాం ఎత్తు తగ్గిస్తే నీటి నిల్వ సామర్థ్యం మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..



చేనేత స్టాల్‌ను ఆసక్తిగా తిలకిస్తున్న సిఎం జగన్

జి 20 సందడి

సరైన మార్గనిర్దేశకత్వం చేయాలని ప్రతినిధులను కోరారు.

ఘన స్వాగతం

సిఎం మంగళవారం సాయంత్రం 7.05 గంటలకు విశాఖ విమానాశ్రయం చేరుకున్నారు. అక్కడ రాష్ట్ర మంత్రులు విడదల రజిని, బూడి ముత్యాలనాయుడు, గుడివాడ అమర్‌నాథ్, ఆదిమూలపు సురేష్, ఆర్‌కె.రోజా, ఎంపీ ఎంవివి.సత్యనారాయణ, నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, విఎంఆర్‌డిఎ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, మున్సిపల్ స్పెషల్ సిఎస్ శ్రీలక్ష్మి, టూరిజం స్పెషల్ సిఎస్ రజత్ భార్గవ్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, పోలీసు కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్, శాసనసభ్యులు, గొల్ల బాబూరావు, కరణం ధర్మశ్రీ, తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్‌కుమార్, భాగ్యలక్ష్మి, శెట్టి ఫాల్గుణ, శాసన మండలి సభ్యులు, వరుదు కళ్యాణి, నాగార్జున ఘనస్వాగతం పలికారు.

జి-20 వసుదైక కుటుంబం పుస్తకం ఆవిష్కరణ

విమానాశ్రయంలో జి-20 వసుదైక కుటుంబం ఒకే భూమి - ఒకే కుటుంబం - ఒకే భవిష్యత్తు పుస్తకాన్ని రాష్ట్ర మంత్రులు ఆర్‌కె.రోజా, ఆదిమూలపు సురేష్, గుడివాడ అమర్‌నాథ్‌లు ఆవిష్కరించారు.

ఆత్మహత్య వీడియో కలకలం

స్టీల్ ప్లాంట్ ఉద్యోగి వరప్రసాద్, అతని భార్య తమ జీవితాలను ముగించుకోబోతున్నట్లు పేర్కొన్నారు. ఏడుస్తూ కనిపించారు. తమ కూతురిని బాగా చూసుకోవాలని అల్లుడిని కోరారు. వారి ఆత్మహత్య నిర్ణయం వెనక కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. ఆర్థిక కష్టాలే దీనికి కారణమని బంధువులు, స్థానికులు చెబుతున్నారు. అప్పుల వల్ల ఒత్తిడి తట్టుకోలేక ఇలా చేసినట్లు అభిప్రాయం వ్యక్తం చేశారు. కాగా దంపతుల ద్విచక్ర వాహనం, చెప్పులు, బ్యాగు, మొబైల్ అనకాపల్లి సమీపంలోని కొప్పాక ఏలేరు కాలువ వద్ద కనిపించాయి. దీంతో బంధువులు, పోలీసులు ఏలేరు కాలువ వద్ద గాలిస్తున్నారు. గజ ఈతగాళ్లను రంగంలోకి దించినా ఫలితం కానరాలేదు.

పోలవరంపై కేంద్రం నిర్లక్ష్యం తగదు

196.60 టిఎంసిల నుంచి 92 టిఎంసిలకు కుదించబడుతుందన్నారు. అలాంటప్పుడు ఇది బహుళార్థక జాతీయ ప్రాజెక్టుగా కాకుండా బ్యారేజీగా మారే ప్రమాదం ఉందన్నారు. పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. టిడిపి మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఎపికి జీవనాడిగా భావించబడే అతిపెద్ద ప్రాజెక్టును మరుగుజ్జుగా మార్చి వేసే కుట్ర జరుగుతోందన్నారు. అదే జరిగితే ఉత్తరాంధ్ర, రాయలసీమ వాసుల ఆశలు అడియాశలవుతాయని తెలిపారు. విద్యుత్ ఉత్పత్తికి అవకాశం, ఉత్తరాంధ్రకు కనీసం తాగునీరు అందే పరిస్థితి ఉండవన్నారు. ఈ నేపథ్యంలో ప్రాజెక్టును పూర్తి 45 మీటర్ల ఎత్తుతో 196.60 టిఎంసిల నీటి నిల్వ సామర్థ్యంతో నిర్మించేలా కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి పెంచాలన్నారు. లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ మాట్లాడుతూ పోలవరం నిర్వాసితుల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎత్తు విషయంలో కేంద్రం మొండి వైఖరి వీడాలన్నారు. ప్రొఫెసర్ కెఎస్.చలం మాట్లాడుతూ 1986, 2022లో సంభవించిన భారీ వరదలను ప్రామాణికంగా తీసుకొని రీ సర్వే చేసి ముంపు గ్రామాలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లించాలన్నారు. ముంపు ప్రాంతాల్లోని యువతీ యువకులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జనసేన రాష్ట్ర పిఎసి సభ్యులు కోన తాతారావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు జి.గోవిందరావు, ఆప్ నాయకులు లోకనాథం, సిపిఐ విశాఖ, అనకాపల్లి జిల్లాల కార్యదర్శులు ఎం.పైడిరాజు, బి.వెంకటరమణ, పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఈ-కామర్స్ వ్యాపారానికి ఎపి కీలకం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ-కామర్స్ ఎగుమతుల వ్యాపారానికి ఆంధ్రప్రదేశ్ కీలక మార్కెట్ అని అమెజాన్ ఇండియా గ్లోబల్ ట్రేడ్ డైరెక్టర్ భూపేన్ వాకంకర్ తెలిపారు. మంగళవారం నగరంలోని నోవటెల్ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అమెజాన్ గ్లోబల్ సెల్లింగ్ ప్రోపెల్ స్టార్టప్ యాక్సిలరేటర్ (ప్రోపెల్ ఎస్- 3) మూడో సీజన్‌ను అమెజాన్ ఇండియా ప్రారంభించినట్లు ఆయన ప్రకటించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న వినియోగదారులను చేరుకోవడానికి అభివృద్ధి చెందుతున్న భారతీయ బ్రాండ్లు, స్టార్టప్‌లకు మద్దతు అందించడానికి దీన్ని రూపొందించామని చెప్పారు. ఈ ప్రోగ్రాంలో పాల్గొనేవారికి ఎడబ్ల్యుఎస్ యాక్టివేట్ క్రెడిట్స్, యాడ్స్ క్రెడిట్స్, లాజిస్టిక్స్, అకౌంట్ మేనేజ్‌మెంట్ మద్దతుతో సహా 1.5 మిలియన్ డాలర్లకుపైగా రివార్డులను గెలుచుకునే అవకాశాన్ని అందిస్తున్నట్లు వెల్లడించారు. రెండేళ్లుగా విశాఖ జిల్లా నుంచి హస్త కళలు, ప్యాకేజ్డ్ ఫుడ్ ఎగుమతి చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో ఏకో రైట్ సహ వ్యవస్థాపకులు ఉదిత్ సూద్ తదితరులు పాల్గొన్నారు

ముఠా కార్మికులకు కేరళ తరహా చట్టం చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ముఠా కార్మికులకు కేరళ తరహా సమగ్ర చట్టం చేయాలని విశాఖ జిల్లా ముఠా కార్మికుల యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు వై.రాజు డిమాండ్ చేశారు. మంగళవారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ముఠా కార్మికుల ఆఫీస్ బేరర్లు, మేస్త్రీల సమావేశం టి.పైడిరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వై.రాజు మాట్లాడుతూ రోజురోజుకూ ముఠా కార్మికుల పరిస్థితులు అగమ్యగోచరంగా మారుతున్నాయని, పని తగ్గి ఆదాయం కుంటుపడుతోందని అన్నారు. మరోవైపు నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి కుటుంబ పోషణ భారంగా మారిపోతోందన్నారు. ప్రభుత్వమే చొరవ చూపించి ముఠా కార్మికులకు కేరళ తరహాలో సమగ్ర చట్టం చేయాలన్నారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుబ్బారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కార్మిక చట్టాల్లో మార్పులు ముఠా కార్మికులకు గుదిబండగా మారాయన్నారు. ఇంతవరకూ ఆదాయంలో భాగంగా ఉన్న లారీ మామూలుకు కూడా షావుకారులు, లారీ యజమానులు ఎగనామం పెట్టారని తెలిపారు. ముఠా కార్మికుల కూలి రేట్లను ధరలకు అనుగుణంగా పెంచడం లేదన్నారు. ఏప్రిల్ 5న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం చలో ఢిల్లీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో ముఠా కార్మికులు రాజు, నాయుడు పాల్గొన్నారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం చేపట్టిన ఉద్యమానికి ఏప్రిల్ 1 నాటికి రెండు సంవత్సరాలు పూర్తవుతుందని, ఆ రోజు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగే భారీ ప్రదర్శనలో తాము పాల్గొంటామని ముఠా యూనియన్ నాయకులు తెలిపారు.

బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చడం దారుణం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

అర్హులు కాని బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేరుస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అత్యంత దారుణమైనదని గిరిజన సంఘం నేతలు అన్నారు. గిరిజన ఎమ్మెల్యేలు తాజా అంశంపై తమ వైఖరిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. మంగళవారం ఎంవిపి కాలనీలోని గిరిజన్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడారు. ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకిస్తూ ఈ నెల 31న తలపెట్టిన మన్యం బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం బంద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షులు దామోదర్, ప్రధాన కార్యదర్శి బొంజుబాబు, సహాయ కార్యదర్శి చిన్నంనాయుడు, గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రుడా సత్యారావు, అధ్యక్షులు కోరాబు సత్యనారాయణ, ఉపాధ్యక్షులు అంబాడీ కోటేశ్వరరావు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న సురేంద్ర, సత్యనారాయణ తదితరులు

పరిశ్రమల స్థాపనకు సహకారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఏప్రిల్‌లో పది వేల మందికి ఉపాధి లక్ష్యంగా ఎంఎస్‌ఎంఇ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని రాష్ట్ర పరిశ్రమల సమాఖ్య అధ్యక్షులు బివి.రామారావు వెల్లడించారు. హోటల్ దసపల్లాలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సంస్థ ఏర్పాటుకుగాను అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో 110 ఎకరాల స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం కేటాయించాలని కోరారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా అవసరమన్నారు. తాము ఏర్పాటు చేసే కార్పొరేషన్ ద్వారా పరిశ్రమలకు ముడి సరుకు సరఫరా చేస్తామని వెల్లడించారు. గత, ప్రస్తుత ప్రభుత్వాల హయాంలో జరిగిన పెట్టుబడుల సదస్సుల వల్ల ఎటువంటి ప్రయోజనమూ లేదన్నారు. పబ్లిసిటీకి మాత్రమే ఈ సమ్మిట్లు ఉపయోగపడ్డాయన్నారు. రాష్ట్ర మంత్రులకు వారి శాఖల మీద అవగాహన లేదన్నారు.

స్కూలు ఫీజులు తగ్గించాలని ధర్నా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పెంచిన స్కూలు ఫీజులు తగ్గించాలంటూ స్థానిక ఆల్వార్‌దాస్ పబ్లిక్ స్కూల్ వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం ఆందోళన చేపట్టారు. విద్యార్థుల ఫీజులు ఈ ఏడాది ఒక్కసారిగా 50 శాతం మేర పెంచడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్కూల్ యాజమాన్యంపై జిల్లా విద్యాశాఖ అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని, ఫీజుల క్రమబద్ధీకరణకు చొరవ చూపాలని డిమాండ్ చేశారు. ఆందోళన విషయం తెలిసి సంఘటనా స్థలానికి చేసుకున్న ఎంవిపి సిఐ సిహెచ్.మల్లేశ్వరరావు విద్యార్థుల తల్లిదండ్రులను సముదాయించారు. తక్షణమే ఫీజులు తగ్గించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యాన్ని హెచ్చరించారు.

మహిళల భద్రతపై సదస్సు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ యాక్షన్ ఎయిడ్ ఆధ్వర్యంలో మధురవాడ స్వతంత్ర నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో హ్యూమన్ రైట్స్ డిఫెండర్ డి.ఇందు నిర్వహణలో మహిళల భద్రతపై మంగళవారం అవగాహన సదస్సు జరిగింది. మహిళా కార్మికులు వారి పని ప్రదేశాల్లో ఎలాంటి హింసకు గురవుతున్నారో ఆమె తెలియజేశారు. మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో 60 మంది మహిళా కార్మికులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఇందు

స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుకు ధర్నా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇసుకతోట సర్వీస్ రోడ్డులో స్పీడ్ బ్రేకర్లు వేసి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఉదయ ఎఐటియుసి ఆధ్వర్యంలో ఇసుకతోట జంక్షన్‌లో ధర్నా నిర్వహించారు. సంఘం జిల్లా కార్యదర్శి జి.వామనమూర్తి మాట్లాడారు. ఎం.గోవింద్, రావి కృష్ణ, మరడ రమణ, గడ్డం రాము, పి.కృష్ణ, పి.రామమ్మ, డి.రామారావు, కె.దుర్గారావు పాల్గొన్నారు.

వృద్ధుడు అదృశ్యం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నక్కవానిపాలెం 60 అడుగుల రోడ్డులో నివసిస్తున్న నక్కా అప్పల రెడ్డి (65) ఈ నెల 17 నుంచి కనిపించడం లేదంటూ అతని కుమారుడు రమేష్ రెడ్డి మంగళవారం ఎంవిపి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన కథనం మేరకు అప్పలరెడ్డి ఈనాడు ప్రెస్‌లో పనిచేసి రిటైర్ అయ్యారు. ఇంటి వద్ద ఉంటూ కుటుంబీకులతో నిత్యం గొడవలకు దిగేవారు. ఇదే క్రమంలో ఈ నెల 17న అలిగి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు.

ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఆటో కార్మికులకు భద్రతతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని విశాఖపట్నం జిల్లా ఆటో రిక్షా కార్మిక సంఘం (ఎఐటియుసి) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.రెహమాన్ డిమాండ్ చేశారు. అల్లిపురంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో మంగళవారం జరిగిన ఆటో డ్రైవర్ల జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు.

మహిళా సంక్షేమానికి పెద్దపీట : ముత్తంశెట్టి

ప్రజాశక్తి- తగరపువలస : మహిళా సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్లు భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. చిట్టివలస ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో మంగళవారం జివిఎంసి ఒకటో వార్డులో ఉన్న 2,668 మంది పొదుపు సంఘాల సభ్యులకు ఆసరా పథకం కింద విడుదలైన రూ.కోటి 95 లక్షల చెక్కును ఆయన అందజేశారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, గతంలో ఎన్నడూ లేనివిధంగా మహిళలకు తమ ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులందరికీ ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. భీమిలి జోన్ పరిధిలో ఇప్పటి వరకు రూ.180 కోట్లతో 35 అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రూ.154 కోట్ల విలువ గల 23 రకాల సంక్షేమ పథకాలు అందించినట్లు వివరించారు. వార్డు కార్పొరేటర్ అక్కర మాని పద్మ, కో-ఆప్షన్ సభ్యులు కొప్పల ప్రభావతి, జెడ్‌పిటిసి సభ్యులు గాడు వెంకటప్పుడు, ఎఎంసి చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, సింగనబంద సర్పంచ్ గాడు వెంకట నారాయణ, జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, యుసిడి ఎపిడి ఎల్ రాము, వైసిపి వార్డు అధ్యక్షులు జగుపిళ్ళ ప్రసాద్, మాజీ కౌన్సిలర్లు ఉప్పాడ నాగేశ్వరరావు, జివి.రమణ, కొప్పల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



పొదుపు సంఘాల సభ్యులకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

భూముల రీ సర్వే ప్రారంభం

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం, సింగనబంద గ్రామ పంచాయతీ పరిధిలో భూముల రీ సర్వే మంగళవారం ప్రారంభమైంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి డ్రోన్ ఫ్లై నిర్వహించారు. తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్, మండల సర్వేయర్ రమేష్, సర్పంచ్ గాడు వెంకటనారాయణతో కలిసి జెడ్‌పిటిసి సభ్యులు గాడు వెంకటప్పుడు ఈ సర్వేను లాంఛనంగా ప్రారంభించారు. భూములకు సంబంధించిన మ్యాప్‌లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా జెడ్‌పిటిసి సభ్యులు గాడు వెంకటప్పుడు మాట్లాడుతూ, దాదాపు 60 ఏళ్ల తర్వాత ఈ తరహా భూ సర్వే ప్రారంభమైనట్లు వివరించారు. సర్వే చేశాక రైతులకు శాశ్వత భూ హక్కు కల్పిస్తూ ల్యాండ్ పార్శిల్ మ్యాప్‌లను రెవెన్యూ అధికారులు రైతులకు అందజేస్తారని తెలిపారు.

104 వాహనం ప్రారంభం

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో 104 వాహనాన్ని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మంగళవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ, ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా ఇప్పటికే నియోజకవర్గ పరిధిలో ఈ తరహా వాహనాలు 4 ఉండగా, అదనంగా మరో వాహనం ఏర్పాటు చేసుకున్నట్లు వివరించారు. ఏదైనా సందర్భంలో వాహనం మరమ్మతుకు గురైతే అదనంగా ఏర్పాటు చేసుకున్న ఈ వాహనం ఉపయోగ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ బి.మల్లికార్జునరావు, జివిఎంసి కో-ఆప్షన్ సభ్యులు కొప్పల ప్రభావతి, ఎఎంసి చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : పద్మనాభం మండలం బాందేవుపురంలో కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూములను పరిరక్షించాలని కోరుతూ స్థానిక రెవెన్యూ అధికారులకు మంగళవారం ఫిర్యాదు చేసినట్టు అఖిల భారత మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు కొత్తలి గౌరినాయుడు తెలిపారు. బాందేవుపురం రెవెన్యూ పరిధిలో సుమారు కొన్ని వందల ఎకరాల ప్రభుత్వ భూములను అదే గ్రామానికి చెందిన కొంత మంది ఆక్రమణలకు పాల్పడ్డారని వినతిపత్రంలో ఆయన పేర్కొన్నారు. ఈ గ్రామంలోనే కాకుండా మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ భూములను రాజకీయ అండతో కొందరు ఆక్రమించుకుంటున్నారని ఆరోపిస్తూ సోమవారం పద్మనాభం మండల కేంద్రంలో పలువురు దళితులు చేపట్టిన నిరసన ఓ ఉదాహరణ అన్నారు. ఆక్రమణకు గురవుతున్న భూములను స్వాధీనం చేసుకొని, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు.

పూడికతీత పనుల పరిశీలన



పూడిక తీత పనులను పరిశీలిస్తున్న ఎంపిపి రాంబాబు తదితరులు

ప్రజాశక్తి-పద్మనాభం : మండల పరిషత్ నిధులు రూ.3లక్షలతో సుమారు 3 కిలో మీటర్ల పరిధిలో ఉన్న పెద్ద కాలువలో పూడికతీత పనులు మూడు రోజులుగా ముమ్మరంగా చేస్తున్నారు. ఈ పనులను ఎంపిపి కె.రాంబాబు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సుమారు 15 సంవత్సరాల నుంచి కాలువలో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో నీరు అందక సాగు రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాలువలో పూడిక తీత పనులు లేక నీరు సరిగా రావడంలేదని స్థానిక రైతులు విలాస్‌ఖాన్‌పాలెం గ్రామానికి చెందిన ఎంపిటిసి బోని సావిత్రి, సర్పంచ్ నల్లి సత్యవతి దృష్టికి తీసుకువెళ్లారు. ఇటీవల జరిగిన మండల బడ్జెట్ సమావేశాల్లో ఈ విషయాన్ని ఎంపిపి రాంబాబు దృష్టికి సావిత్రి, సత్యవతి తీసుకెళ్లారు. స్పందించిన ఎంపిపి వెంటనే నిధులు మంజూరు చేశారు. దీంతో పూడికతీత పనులు చేపట్టారు. కాలువను తవ్వడంతో నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా మద్ది గ్రామానికి చెందిన రాజు వెంకటపతిరాజు చెరువుకు చేరుకుంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పద్మనాభరాజు చెరువు నుంచి వచ్చిన కాలువ సరిగ్గా లేక పోవడం వల్ల నీరు పొలాలకు చేరక పంటలు పండేవి కాదని రైతులు వివరించారు. ఇంకా మూడు కాలువలు పూడికలతో నిండి ఉన్నాయని, వాటికి కూడా నిధులు కేటాయించి పూడికలు తీయాలని రైతులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.సన్యాసినాయుడు, నల్లి సన్యాసప్పుడు, బి.అప్పలనాయుడు, కె.రామకృష్ణ, రైతులు బోని రామకృష్ణ, జి.శ్రీను, ఆర్.ముత్యాలప్పుడు తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రి అప్పన్నను దర్శించిన మంత్రి రోజా

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్నను మంగళవారం టూరిజం శాఖ మంత్రి ఆర్‌కె.రోజా దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ ఈవో వి.త్రినాధరావు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. ఆమె ముందుగా కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపం చుట్టూ ప్రదర్శన చేశారు. స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధిలోనూ ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించారు. స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని రోజాకు ఈవో అందించి శాలువాతో సత్కరించారు. దర్శనం అనంతరం రోజా స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ, ప్రసాదం స్కీం ద్వారా కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.54 కోట్లతో త్వరలో అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. దీనికోసం ఇప్పటికే ఈవో ప్రణాళిక సిద్ధం చేసి అందజేశారని చెప్పారు.

శిల్పారామంలో...

పిఎం.పాలెం: మధురవాడ శిల్పారామంలో ఏర్పాటుచేసిన గాంధీ శిల్పబజార్‌ను మంగళవారం రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కె.రోజా సందర్శించారు. వ్యాపారులతో కాసేపు ముచ్చటించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి వైసిపి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. విశాఖ, తిరుపతి, అనంతపురం, కడప పులివెందుల, పుట్టపర్తి, కాకినాడ ఇలా 8 చోట్ల శిల్పారామాలు ఉన్నాయని, రానున్న రోజుల్లో శ్రీకాకుళం, చిత్తూరు, విజయనగరం కర్నూలులో శిల్పారామాలు ఏర్పాటుచేసి మరింత అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. విశాఖలోని శిల్పారామం ఆహ్లాదకర వాతావరణంలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, శిల్పారామాల ముఖ్య కార్య నిర్వహణ అధికారి డి.శ్యామసుందర్ రెడ్డి, స్థానిక నిర్వహణ అధికారి టి.విశ్వనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

కృత్రిమ మేధతో మానవ జీవన ప్రమాణాల పెంపు

గీతంలో బ్రెజిల్ శాస్త్రవేత్త విజయకుమార్

ప్రజాశక్తి-మధురవాడ : పర్యావరణ పరిరక్షణ, విద్యుత్తు, తాగునీటి వినియోగం, సహజమైన గాలి, వెలుతురు ఉపయోగించుకునే భవన నిర్మాణాలు ఆకర్షణీయ నగరాలలో అవసరమని, దీనికి కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఉపయోగపడుతుందని, తద్వారా మానవ జీవన ప్రమాణాలు పెరుగుతాయని బ్రెజిల్ శాస్త్రవేత్త ఎన్ఎల్.విజయకుమార్ పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఉపాధి కోసం పట్టణాలకు వలస వచ్చే ప్రజల సంఖ్య ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతూ వస్తోందని, 2100 సంవత్సరం నాటికి ప్రపంచ జనాభాలో 80 శాతం పట్టణాలలోనే ఉంటారని ఆయన తెలిపారు. పట్టణాలలో పెరుగుతున్న జనాభా అవసరాలను గుర్తించడంతో పాటు ఉన్న వనరులను పొదుపుగా, సమర్థంగా ఉపయోగించుకోవడంపై ఆకర్షణీయ నగరాలు దృష్టి సారించాల్సి ఉందన్నారు. ఆకర్షణీయ నగరాలలోని బహిరంగ ప్రదేశాలలో సెన్సార్ల వినియోగం ద్వారా అనునిత్యం సమాచార సేకరణ, నీటి సరఫరాలో వృధాలను అరికట్టడానికి కృత్రిమ మేధతో లీకేజీల గుర్తింపు, విద్యుత్తును పొదుపుగా వాడడానికి స్మార్ట్ మీటర్ల వినియోగం, భవన నిర్మాణ వ్యర్థాలను తగ్గించడం, నిర్మాణంలో సహజమైన గాలి వెలుతురు ఉండేలా చూసుకోవడం కీలక అంశాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల నుంచి ప్రజలను రక్షించడానికి, ప్రమాదాలను ముందుగా గుర్తించడానికి సెన్సార్లు ఉపయోగపడతాయని తెలిపారు. బ్రెజిల్‌తో సహ వివిధ దేశాలలోని ఆకర్షణీయ నగరాలలో అమలు జరుగుతున్న ప్రాజెక్టులను ఆయన వివరించారు. కార్యక్రమానికి సిఎస్ఇ విభాగం అధిపతి ప్రొఫెసర్ శిరీష, ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్ జి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక నేరెళ్లవలస కాలనీ పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో నివసిస్తున్న పీతల దేవి (16) మంగళవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మ హత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. విజయనగరం జిల్లా గొల్లలపేటకు చెందిన పీతల దేవికి స్థానిక నేరెళ్లవలస కాలనీకి చెందిన జోగ రమేష్‌కు 2022 ఆగస్టు నెలలో వివాహమైంది. ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు దేవి తల్లికి రమేష్ ఫోన్ చేసి చెప్పాడు. అనుమానం, వేధింపుల వల్లనే తన కుమార్తె ఆత్మహత్య చేసుకుందని, ఇందుకు కారణం ఆమె భర్త అని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో మృతురాలి తల్లి ఎర్రయ్యమ్మ పేర్కొంది. సిఐ కె.లక్ష్మణమూర్తి ఆధ్వర్యాన ఎసిపి శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'నిర్మాణ్ ఉత్సవం'లో సివిల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యాన జరుగుతున్న 'నిర్మాణ్ ఉత్సవం' యువ సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థుల నూతన ఆవిష్కరణలకు వేదికైంది. సివిల్ ఇంజనీరింగ్ నిపుణుల ప్రతిభకు అద్దం పట్టే భారీ వంతెనలు, ఫ్లైఓవర్లు, సరికొత్త భవన నిర్మాణ సామగ్రి, నదులు సముద్రాలపై హైడ్రాలిక్ వంతెనల నిర్మాణం వంటి నమూనాలను విద్యార్థులు మంగళవారం నిర్మాణ్ ఉత్సవంలో ప్రదర్శనగా ఉంచారు. నగరంలోని వివిధ కళాశాలల నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చిన సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు తమ ప్రాజెక్టు నమూనాలను సహితం ఈ ప్రదర్శనలో ఉంచారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీలలో విజేతలకు గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ సి.విజయశేఖర్ సర్టిఫికేట్‌లను అందజేశారు. సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ డి.ముకుంద్ మాట్లాడుతూ, గీతంలో సివిల్ ఇంజనీరింగ్ కోర్సు పూర్తిచేసిన విద్యార్థులు దేశ, విదేశాలలో కీలక స్థానాలలో ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సివిల్ ఇంజనీరింగ్ నిపుణుడు బి.రవిచంద, ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.చెందన కుమార్, డాక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్

ప్రజాశక్తి -పిఎం పాలెం : మధురవాడ రేవళ్లపాలెం సమీపంలో ఉన్న అమ్మఒడి కేంద్రంలో ధాత్రి ఫౌండేషన్ ఆధ్వర్యాన చంద్రంపాలెం పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు పర్సనాలిటీ, కెరియర్ గైడెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ధాత్రి ఫౌండేషన్ ఫౌండర్ సిహెచ్.విశాలాక్షి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బుల్లయ్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దీన బంధు విద్యార్థులకు 10వ తరగతి పరీక్షలు ఏ విధంగా రాయాలి అనే అంశంపై పలు సూచనలు చేశారు. అనంతరం పరీక్షలు రాయబోయే 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష అట్టలు, బాక్స్‌లు, పెన్నులు పంపిణీ చేశారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.2 కోట్లు

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్నకు భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలు 24 రోజులకు గానూ దేవస్థానం ఈవో వి.త్రినాధరావు పర్యవేక్షణలో మంగళవారం లెక్కించారు. నగదు రూ.2,06,11,210, బంగారం 100 గ్రాముల 600 మిల్లీగ్రాములు, వెండి 12 కేజీల 475 గ్రాములు, వివిధ దేశాలకు చెందిన కరెన్సీ నోట్లు లభించినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. 14 హుండీల ద్వారా ఈ ఆదాయం లభించినట్లు అధికారులు పేర్కొన్నారు.

ఘనంగా వైఎస్ఆర్‌టియుసి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-ఉక్కునగరం : వైఎస్ఆర్‌టియుసి కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి హాజరై యూనియన్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ స్థాపించి 11 సంవత్సరాలు పూర్తి చేసుకుని 12వ సంవత్సరంలో అడుగు పెట్టటానికి కార్మికుల మద్దతే కారణమన్నారు. స్టీల్ ప్లాంట్‌లో యూనియన్ బలోపేతానికి కార్మికులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి పిట్టారెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ మార్టుపూడి పరదేశి, 74వ వార్డు కార్పొరేటర్ తిప్పలు వంశీరెడ్డి, వైసిపి గాజువాక ఇన్‌ఛార్జి తిప్పల దేవన్‌రెడ్డి, పిట్టా రెడ్డి, గొందేశి రమణారెడ్డి, అండిబోయిన అప్పారావు, కూటుకుప్పల జనార్దన్, తౌకాడ అప్పారావు, గొందేశి అప్పలరెడ్డి, మలకలపల్లి వెంకటేష్, బోరా శశిభూషణ్, వెంపాడ వరప్రసాద్‌రెడ్డి, పిట్ట చంద్రయ్య, టేకటి శ్రీను,పెద్దాడ కనకరాజు, ఎస్.చంద్రశేఖర్, గొందేశి రాము, ఎం.జగ్గారావు, వాసు అప్పల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కొసనా' చిరస్మరణీయులు



కొసనా చిత్రపటం వద్ద నేతల నివాళి

ప్రజాశక్తి-సీతమ్మధార : ఆరున్నర దశాబ్దాల సాంస్కృతిక రంగ రథ సారథిగా సేవలందించిన కొసనా చిరస్మరణీయులని పలువురు కొనియాడారు. ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొసనా తృతీయ వర్ధంతిని మంగళవారం పౌర గ్రంథాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ మాట్లాడుతూ, కళలను, కళాకారులను ప్రోత్సహించిన సాంస్కృతిక నిఘంటువు కొసనా అని కీర్తించారు. కళా వేదిక ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ నండూరి రామకృష్ణ మాట్లాడుతూ సంగీతం, సాహిత్యం, నాటకం, చిత్ర లేఖనం, నిర్వాహక తదితర అంశాల్లో నిరంతరం సేవలు అందించిన వ్యక్తి కొసనా అని కొనియాడారు. కొసనా తనయుడు బ్రహ్మాజీరావు మాట్లాడుతూ, తన తండ్రి స్మారకార్థం ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు అధ్యక్షతన జరిగిన సభలో ఆధ్యాత్మిక వేత్తలు ఎస్.ఫణిస్వామి, ఎంవి.రాజశేఖర్, కొసనా కల్చరల్ అకాడమి అధ్యక్షులు సుసర్ల శేషమణి, స్వర రంజని అధ్యక్షులు లతా రాములు, కళా రంగ ప్రముఖులు మేడా మస్తాన్‌రెడ్డి, నాంచారయ్య, పి.శ్యామ్‌సుందర్, మెలోడీ సత్యనారాయణ, ఎంవిఆర్ నాగేశ్వరరావు, ఎంటిఆర్ త్రినాధ్, లెఫ్టినెంట్ లోకేష్, బంగార్రాజు, బి.సత్యమాధురి తదితరులు కొసనా చిత్ర పటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

సిఒసిసిపి విభాగ భద్రతా వారోత్సవాలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ సిఒ సిసిపి విభాగంలో జాతీయ భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. స్టీల్ ప్లాంట్ కోక్ ఓవెన్స్ విభాగాధిపతి మిశ్రా జెండాను ఎగురవేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిఒసిసిపి విభాగం ప్లాంట్‌లోనే అత్యంత ప్రమాదకరమైన విభాగమన్నారు. ఇక్కడ పనిచేయాలంటే త్యాగనిరతి, అంకిత భావం ఉండాలని పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనైనా భద్రతా పనిముట్లు, నిబంధనలు విధిగా పాటించాలని ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో అధికార్లు రౌత్, రవికుమార్, శ్రీనివాసరావు, తాతారావు, నాగేశ్వరరావు సేఫ్టీ అధికారులు ఒ.హనుమంతరావు, సురేష్, డెమోక్రాటిక్ స్టీల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బొండా యల్లాజీరావు, గుర్తింపు యూనియన్ నాయకులు జ్యోతి ప్రసాద్, తాండ్ర కనకరాజు, బి.కామేశ్వరరావు, బొమ్మిసెట్టి భాస్కరరావు, ముసినడ శ్రీనివాసరావు, కర్రి బాబూరావు, ఎస్.దేముడునాయుడు, యడ్ల శేషగిరిరావు, గంగడ సత్యనారాయణ పాల్గొన్నారు.

పరీక్షా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-వేపగుంట : జివిఎంసి 4వ వార్డు పరిధి వేపగుంట ప్రభుత్వ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు బాలాజీ హోటల్ అధినేత రాము ఆధ్వర్యాన పరీక్ష రాసేందుకు అవసరమైన సామగ్రిని మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ, ఏటా 10వ తరగతి విద్యార్థులకు ప్లాంక్, జామెట్రీ, బాక్స్, పెన్నులు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది పదో తరగతిలో మొదటి మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతి అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

భగత్ సింగ్ ఆశయాలు కొనసాగిద్దాం

ప్రజాశక్తి-పెందుర్తి : భగత్‌సింగ్ ఆశయాలను కొనసాగించాలని వక్తలు పిలుపునిచ్చారు. జివిఎంసి 96, 97 వార్డుల పరిధి కార్మిక నగర్, పెందుర్తి ప్రాంతాల్లో భగత్ సింగ్ వర్ధంతి వారోత్సవాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జోన్ కార్యదర్శి బి.రమణి మాట్లాడుతూ, బ్రిటిష్ వారు గుండెల్లో దడ పుట్టించిన మహనీయుడు భగత్‌సింగ్ అన్నారు. స్వాతంత్ర్య కోసం తన ప్రాణాన్ని త్యాగం చేశారని తెలిపారు. ఆయన ఆశయాన్ని కొనసాగిద్దామని యువతకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలు కాలనీల వాసులు పాల్గొన్నారు.



భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రమణి తదితరులు


ఉత్తమ ఫలితాలపై దృష్టి

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్ పదో తరగతి విద్యార్థులు మంచి మార్కులు సాధించాలని, ఫలితాల్లో జిల్లాలో మొదటి వరుసలో ఉండాలనే ఉద్దేశంతో ఉపాధ్యాయులు తీవ్ర కృషి చేస్తున్నారు. గాజువాక నియోజకవర్గ పరిధిలో పెద్ద పాఠశాల గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్. 416 మంది విద్యార్థులు ఉన్న ఈ పాఠశాలలో ప్రతి ఐదుగురినీ ఒక ఉపాధ్యాయుడు దత్తత తీసుకొని చదివిస్తున్నారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో తెలివైన, వెనకబడి ఉన్న విద్యార్థులను విభజించి వేర్వేరుగా ప్రత్యేక శ్రద్ధ తీసుకొని చదివించే కార్యక్రమాలు చేస్తున్నారు. గణితం, సైన్సు, ఇంగ్లీషుపై ఎక్కువ శ్రద్ధ పెట్టారు. మిగతా సబ్జెక్టులపై కూడా అశ్రద్ధ చేయకుండా చదివిస్తున్నారు. పిల్లల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేస్తూ, పరీక్షలకు ఏ విధంగా సిద్ధం కావాలో రోజూ విద్యార్థికి అర్థం అయ్యేలా బోధిస్తున్నారు. ఈ సారి జరిగే పదో తరగతి పరీక్షలు ఆరు పేపర్లు కావడంతో సమయాభావం ఎదురవుతుందని, దీన్ని ఏ విధంగా అధిగమనించి పరీక్షలు రాయాలో నేర్పుతున్నారు.

సాయంత్రం సమయంలో నిర్వహించే ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులు ఆకలితో ఉంటారని భావించి దాతల సహాయంతో స్నాక్స్ అందిస్తున్నారు. నెల రోజుల క్రితం తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటుచేసి ఇంటి దగ్గర తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు.

స్టడీ అవర్‌లో సందేహాల నివృత్తి

మా సందేహాలను స్టడీ అవర్‌లో నివృత్తి చేస్తున్నారు. ఇంటికి వెళ్లిన తర్వాత ఎలాంటి ప్రైవేట్ అవసరం లేదు. పదవ తరగతిలో మంచి మార్కులు సాధిస్తానన్న నమ్మకం ఉంది.



పి.భరత్,
పదవ తరగతి విద్యార్థి,
జిల్లా పరిషత్ హైస్కూల్,
గాజువాక

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని చదివిస్తున్నాం. స్టడీ మెటీరియల్ కూడా అందజేశాం. సాయంత్రం సమయంలో పిల్లలకు దాతల సహాయంతో స్నాక్స్ అందజేస్తున్నాం. మంచి ఫలితాల సాధన కోసం కృషి చేస్తున్నాం.



అరుణ్ కుమార్
ప్రధానోపాధ్యాయులు

మోడల్ పేపర్లు అందించాం


యుటిఎఫ్ రూపొందించిన మోడల్ పేపర్లను విద్యార్థులకు అందజేసి తగిన తర్ఫీదు ఇస్తున్నాం. పరీక్ష పేపర్ ఏ విధంగా పూర్తి చేయాలన్న దానిపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. మంచి ఫలితాల కోసం ఉపాధ్యాయులంతా కష్టపడి పని చేస్తున్నారు.



టి.అప్పారావు, యుటిఎఫ్ రాష్ట్ర
కౌన్సిల్ మెంబర్

ప్రణాళిక ప్రకారం చదువుతున్నా

పదో తరగతిలో ఈ సారి రెండు పేపర్లు కలిపి ఒకే రోజు నిర్వహించడం వల్ల సమయాభావం ఎదురవుతుంది. సమయం తక్కువగా ఉంటుంది కాబట్టి దానిని అధిగమించేందుకు ప్రణాళికా బద్ధంగా ప్రిపేర్ అవుతున్నాం.



వి.వంశీకృష్ణ,
పదవ తరగతి విద్యార్థి,
జిల్లా పరిషత్ హైస్కూల్,
గాజువాక

కేంద్ర మంత్రి దృష్టికి 'ఉక్కు' సమస్యలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్‌లోని సమస్యలను ఉక్కు కేంద్ర సహాయ మంత్రి ఫాగ్గన్‌సింగ్ కులేస్తే దృష్టికి ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ గుర్తింపు సంఘం నాయకులు తీసుకెళ్లారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగ సంస్థగా కొనసాగించి రిజర్వేషన్లు కాపాడాలని, ఎక్జిక్యూటివ్, నాన్ ఎక్జిక్యూటివ్ ప్రమోషన్స్ ఇవ్వాలని, వేజ్ రివిజన్‌తో పాటు రా మెటీరియల్స్ కొరత లేకుండా చూడాలని, వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను సెయిల్, ఎన్ఎండిసిలో విలీనం చెయ్యాలని కోరారు. కేంద్రమంత్రిని కలిసిన వారిలో ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షుడు బొండ తౌడన్న, ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ సత్యానారాయణ, వైస్ ప్రెసిడెంట్ పుల్లారావు, సెక్రెటరీ ఎస్ మోహన్‌బాబు, దాకే సువర్ణరత్నం తదితరులు ఉన్నారు.

ఇఒఐని రద్దు చేయాలని

ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ (ఇఒఐ)ను రద్దుచేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్‌చేశారు. స్టీల్‌ప్లాంట్ బిఎఫ్-3లో ఉత్పత్తిని పునరుద్ధరించడానికి ఇఒఐని విడుదల చేయడం ఏకపక్ష నిర్ణయమని తెలిపారు. దీనివల్ల కంపెనీ మనుగడకే ముప్పు వాటిల్లుతుందని కేంద్ర ఉక్కు సహాయ మంత్రి ఫాగ్గన్‌సింగ్ కులేస్తేని న్యూఢిల్లీలో పోరాట కమిటీ నేతలు కలిసి తమ వ్యతిరేకతను ప్రకటించారని పేర్కొన్నారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌కు ముడి సరుకు ప్రభుత్వం కల్పించాలని, తద్వారా పూర్తిస్థాయి ఉత్పత్తిని తీస్తామని తెలిపారు. కేంద్ర సహాయ మంత్రిని కలిసిన వారిలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె.అయోధ్యరామ్, కెఎస్ఎన్.రావు, వరసాల శ్రీనివాసరావు, విల్లా రామ్మోహన్‌కుమార్, వై.మస్తానప్ప, జి.గణపతిరెడ్డి, శ్రీనివాసనాయుడు, కారు రమణ, వెంకన్న, పాల్గొన్నారు.



కేంద్ర స్టీల్ సహాయమంత్రికి వినతి ఇస్తున్న ఎస్సీ, ఎస్టీ ప్రతినిధులు

దాదాపుగా బ్రెయిన్ డెడ్..!

బతికించిన కిమ్స్ ఐకాన్ వైద్యులు

ప్రజాశక్తి -గాజువాక : ఒక రోజు తెల్లవారుజామున కడుపునొప్పి, ఆ తర్వాత స్పృహ కోల్పోయి దాదాపు బ్రెయిన్ డెడ్ పరిస్థితిలోకి వెళ్లిపోయిన రైతును ప్రాణాపాయం నుంచి తప్పించినట్లు కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి వైద్యులు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి చెందిన కన్సల్టెంట్ న్యూరో సర్జన్ డాక్టర్ సిహెచ్.విజయ్ చెప్పిన వివరాలు ఆయన మాటల్లోనే.... 'విశాఖ జిల్లా చోడవరం ప్రాంతానికి చెందిన 30 ఏళ్ల రైతుకు తెల్లవారుజామున 6 గంటల సమయంలో కడుపునొప్పి వచ్చింది. మరో రెండు గంటల తర్వాత ఊపిరి పీల్చుకోవడం కష్టమైపోయింది. క్రమంగా కాళ్లు, చేతులు కదలడం కష్టమైపోయింది. బతికున్నాడో లేదో కూడా తెలియకపోవడంతో వెంటనే కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆసుపత్రికి వచ్చేసరికి అతను దాదాపు కోమా స్థితిలో కనిపించాడు. అతను నాడి కొట్టుకోవడం గమనించి, ప్రాణం ఉందని వెంటనే వెంటిలేటర్‌పై పెట్టాం. న్యూరాలజీకి సంబంధించిన పరీక్షలు చేయగా, రోగి అంతర్గత వ్యవస్థలు బాగానే ఉన్నట్లు తేలింది. కళ్లకు సంబంధించిన నరాలు పరీక్షిస్తే అవి స్పందించడం లేదు. ముఖంలోని నరాలు బాగానే ఉన్నాయి. శరీరం మీద పరీక్షిస్తే ఎక్కడా పాము, తేలుకాటు లాంటి గుర్తులు కనిపించలేదు. ఊపిరి బరువుగా తీసుకోవడం, గుండె నిమిషానికి 100 సార్లకు పైగా కొట్టుకోవడం, బీపీలో తేడాలు ఉన్నాయి. సీబీసీ, కాలేయ పనితీరు పరీక్ష, మూత్రపిండాల పనితీరు పరీక్ష అన్నీ సాధారణంగానే ఉన్నాయి. మెదడుకు, వెన్నెముకకు ఎంఆర్ఐ తీయగా అవీ సాధారణంగానే ఉన్నాయి. కానీ ఊపిరి మాత్రం సరిగా అందట్లేదు. దాంతో వెంటిలేటర్ కొనసాగించాల్సి వచ్చింది. న్యూరో మస్క్యులర్ జంక్షన్ సమస్యను పరిష్కరించాలని ఎట్రోఫైన్, నియోస్టిగ్మైన్ లాంటి మందులు ఇచ్చినా రైతు పరిస్థితి పెద్దగా మెరుగుపడలేదు. ఏడో రోజున వెంటిలేటర్ తొలగించాం. ఆ తర్వాత కూడా కొన్ని సమస్యలు ఉండటంతో యాంటీబయాటిక్స్‌తో చికిత్స చేశాం. ఈ రైతుకు వచ్చిన సమస్యలన్నింటి దృష్ట్యా చూస్తే, అతడికి కట్లపాము కాటేసినట్లు భావించాం. పొలాల్లో తిరిగేటప్పుడు కాళ్లకు తగిన రక్షణ లేకపోవడం వల్ల ఇలాంటి కాట్లు పడే అవకాశం ఉంటుంది. కొన్నిసార్లు వాటి కోరల గుర్తులు కనిపిస్తాయి, కొన్నిసార్లు కనిపించవు. పాముకాటు వల్ల వచ్చే ఇలాంటి సమస్యను ఎర్లీమార్నింగ్ పెరాలసిస్ అంటాం. వెంటనే గుర్తించి తగిన చికిత్స అందించకపోతే రోగి క్రమంగా కోమాలోకి వెళ్లిపోయి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంటుంది. ఎంత విషపూరితమైన పాము కరిచినా, రెండు మూడు గంటల్లోగా ఆస్పత్రిలో చికిత్స మొదలైతే ప్రాణాలు కాపాడే అవకాశం ఉంటుంది. పాము కాటు అని గుర్తించకపోయినా ఈ తరహా సమస్యలు వచ్చినప్పుడు వెంటనే వైద్యుల వద్దకు తీసుకెళ్లడం ముఖ్యం' అని డాక్టర్ సిహెచ్ విజయ్ వివరించారు..

'ఉత్తరం'లో గ్రీవెన్స్

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు మంగళవారం పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. నియోజకవర్గానికి చెందిన పలువురు వైసిపి కార్యాలయానికి వచ్చిన సమస్యలతో కూడిన వినతులను కెకె.రాజుకు అందించారు. వినతిపత్రాలను పరిశీలించిన కెకె.రాజు అధికారులతో మాట్లాడి కొన్నింటిని వెంటనే పరిష్కరించారు. మరికొన్నింటిని సంబంధిత అధికారులకు పంపించి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ గ్రీవెన్స్‌లో జివిఎంసి ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్లు కె.అనీల్‌కుమార్‌రాజు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరం

ప్రజాశక్తి - ములగాడ: జివిఎంసి 40వ వార్డు పరిధి ఎకెసి కాలనీ హాస్పిటల్‌లో ఆడారి తులసీరావు చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో ఏర్పాటుచేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని పశ్చిమ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ప్రారంభించారు. వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు సమక్షంలో వైద్యులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ, ప్రస్తుతం వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ కంటి వ్యాధులకు గురవుతున్నారన్నారు. ముందు జాగ్రత్త చర్యగా నియోజకవర్గంలో ప్రజల సేవ కోసం ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని నియోజవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శిబిరంలో సుమారు 190 మందికి పరీక్షలు జరిపారు. 52 మందికి కళ్ళద్దాలు, 67 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీటిని ఆడారి తులసిరావు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉచితంగా అందించనున్నారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా ప్రెసిడెంట్ బద్రీనాథ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆల్ఫా కృష్ణ, వైసిపి నాయకులు వరపాల మహేష్, బాలు, అశోక్, బాలకృష్ణ, తాతబాబు, శ్యామ్, సూర్యనారాయణ, శివ, గణేష్, గోవింద, నూనెల ప్రసాద్ పాల్గొన్నారు.

చలో ఢిల్లీ పోస్టర్ల ఆవిష్కరణ



అనకాపల్లిలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-యంత్రాంగం

రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు, గిరిజన హక్కులు, వనరుల రక్షణ, ప్రభుత్వ రంగ పరిశ్రమలు, ఆర్థిక సంస్థలు రక్షణ కోసం ఏప్రిల్ 5వ తేదీన చేపట్టే చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను మంగళవారం విశాఖ, అనకాపల్లి జిల్లాలోని పలుచోట్ల ఆవిష్కరించారు.

అనకాపల్లి : కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను స్థానిక దొడ్డి రామునాయుడు కార్మిక కర్షక నిలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు, ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి ఎ.బాలకృష్ణ, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్లో కార్మిక కర్షకులు, అణగారిన వర్గాలకు మరింత ఆర్థిక భారాలు మోపే విధంగా ఉందన్నారు. ప్రభుత్వ సంస్థలను కాపాడాలని, అధిక ధరలను అరికట్టాలని, పెట్రోల్ డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు.

చోడవరం : ఏప్రిల్ 5 జరిగే ఛలో ఢిల్లీని విజయవంతం చేయాలని ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి.వరలక్ష్మి పిలుపునిచ్చారు. మంగళవారంఠ చోడవరంలో చలో ఢిల్లీ పోస్టరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా బడ్జెట్ పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్.అమ్మాజీ, పార్వతి, రాజులమ్మ, సత్యవతి, మాణిక్యం, దేముడమ్మ, అర్.బుచ్చిరాజమ్మ పాల్గొన్నారు.

అచ్యుతాపురం : ఎస్ఇజెడ్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక సెజ్ పరిశ్రమలలో మంగళవారం కార్మికులతో కలిసి గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమలలో 75శాతం ఉద్యోగాలు స్థానికులకు ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వం సవరించిన కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము, మండల కార్యదర్శి కె సోము నాయుడు, నాయకులు రాజు, కిషోర్, నరేంద్ర పాల్గొన్నారు.

గాజువాక : చలో ఢిల్లీ కార్యక్రమం జయప్రదం చేయాలని కోరుతూ గాజువాకలోని సిఐటియు కార్యాలయం వద్ద పోస్టర్లను ఆవిష్కరించారు. సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు డి.రమణ, ఎ.లోకేష్, జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గాజువాక జోన్ కమిటీ ప్రధాన కార్యదర్శి గొలగాని అప్పారావు, సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మొద్దు, ప్రభుత్వ రంగంలోని కొనసాగించాలని, ప్రభుత్వ రంగ సంస్థలు, సర్వీసుల ప్రైవేటీకరణ ఆపాలని, వాటిని లీజుకిచ్చే పద్ధతులను, కార్మికులకు నష్టం చేసి నాలుగు లేబరు కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. ప్రజలందరూ మోడీ విధానాలకు వ్యతిరేకంగా చేపట్టే ప్రచారంలో పాల్గొనాలని కోరారు. ఈ నెల 31వ తేదీన ఉదయం 10 గంటలకు పాత గాజువాక నుంచి వైజాగ్ వరకు బైక్ ర్యాలీలో ఉంటుందని పేర్కొన్నారు.

పిఎం పాలెం : జోన్-2 కార్యాలయం అంబేద్కర్ విగ్రహం వద్ద సిఐటియు మధురవాడ జోన్ నాయకులు పోస్టర్‌ను విడుదలచేశారు. సిఐటియు జోన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.కొండమ్మ, పి.రాజ్‌కుమార్ మాట్లాడుతూ, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు, కనీస పింఛన్ రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జోన్ నాయకులు డి.అప్పలరాజు, వి.సంధ్య, జి.చిన్నారావు, రాజు, విప్లవ కుమార్, జి.బంగార్రాజు, కుమారి పాల్గొన్నారు.



చోడవరంలో...



మధురవాడలో..



కశింకోటలో ర్యాలీ చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

పలు చోట్ల ర్యాలీలు

కశింకోట : ఏప్రిల్ 5న ఢిల్లీలో జరుగు చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు, ప్రజా మహిళ సంఘాల ఆధ్వర్యాన మంగళవారం మండల కేంద్రంలో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా స్కీమ్ వర్కర్ల నాయకులు కె.శాంతి, ఎం శ్రీదేవి, ఐద్వా నాయకురాలు డిడి వరలక్ష్మి, భార్గవి, సిఐటియు జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్మికులను యజమానులకు బానిసలుగా చేసే విధంగా మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాల్లో మార్పులు చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ అమ్మాజీ, మణి కుమారి, లావణ్య, లక్ష్మి, నాగమణి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

పరవాడ : ఏప్రిల్ 5న చలో ఢిల్లీని విజయవంతం చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో పరవాడ సినిమా హాల్ జంక్షన్ నుండి తహశీల్దారు కార్యాలయం వరకు మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, నాయకులు గేదెల అప్పారావు, కొండూరు నాయుడు, బి.శ్రీను, సిహెచ్ అప్పలనాయుడు పాల్గొన్నారు.

పద్మనాభం : చలో ఢిల్లీని విజయవంతం చేయాలని సిపిఎం నాయకులు రవ్వ నర్సింగరావు ఆధ్వర్యాన పద్మనాభం జంక్షన్‌లో ర్యాలీ నిర్వహించారు.



పరవాడలో ర్యాలీ చేస్తున్న దృశ్యం



తీర్థ మహోత్సవంలో పాల్గొన్న టిడిపి నేత పైలా ప్రసాదరావు

ఘనంగా బంగారమ్మ, మరిడిమాంబ తీర్థ మహోత్సవం

ప్రజాశక్తి- కె.కోటపాడు

మండలంలోని చౌడువాడ గ్రామంలో బంగారమ్మ, మరిడిమాంబ తీర్థ మహోత్సవం మంగళవారం ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో హాజలై అమ్మవార్లను దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేసింది. అనంతరం ఏర్పాటు చేసిన ఎడ్ల పందెం కార్యక్రమాన్ని టిడిపి మాడుగుల నియోజకవర్గం నాయకులు పైలా ప్రసాదరావు ప్రారంభించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. తన వంతుగా పండగకు రూ.15 వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజల మధ్య సంబంధాలు బలపడటానికి పండుగలు దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బండారు నరసింహనాయుడు, వెలగల పైడంనాయుడు, ఏటుకూరి రాజేష్, బొడ్డు అక్కునాయుడు, గ్రామసర్పంచ్ దాడి ఎరుకునాయుడు, ఎంపిటిసి ఏటుకూరి రాజేష్, సుగర్ ఫ్యాక్టరీ మాజీ డైరెక్టర్ రాజి శ్రీనువాసరావు, బిజిపి నాయకులు కుమార అప్పారావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్రేబ్స్ కంపెనీ వ్యర్థాలపై ఫిర్యాదు

ప్రజాశక్తి - కశింకోట : కొత్తపల్లి క్రేబ్స్ కెమికల్ కంపెనీ వ్యర్థాలను మండలంలోని పరవాడ పాలెం జంక్షన్ వద్ద వేయడంపై కశింకోట గ్రామానికి చెందిన గండిబోయన సుధాకర్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యర్థాలు వల్ల దుర్వాసన, వస్తుందని, జాతీయ రహదారిపై వెళ్లి వచ్చిన వారు భరించలేని ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని సుధాకర్ కోరారు.

నేడు పిఎసిఎస్ మహాజన సభ

ప్రజాశక్తి- కశింకోట : కశింకోట మండలంలోని నరశింగబిల్లి ప్రాథమిక సహకార సంఘం సర్వసభ్య సమావేశం ఈ నెల 29న బుధవారం సాయంత్రం 4 గంటలకు జరుగుతుందని పిఎసిఎస్ కార్యదర్శి నక్కా అచ్చియ్యనాయడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో 202-23 ఖర్చు, రాబడి, 2023 - 24 బడ్జెట్ ఆమోదం, ఇతర అంశాలపై చర్చ ఉంటుందని పేర్కొన్నారు. సంఘం సభ్యరైతులు హాజరు కావాలని కోరారు.

ప్రజా వైద్యులు వైఎల్.నర్సింగరావుకు ఘన సత్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రజా వైద్యులు, ప్రముఖ స్త్రీ వైద్య నిపుణులు, కేజీహెచ్ గైనకాలజీ విభాగపు ప్రొఫెసర్ డాక్టర్ వైఎల్ నర్సింగరావు ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన నేపథ్యంలో స్థానిక సిఐటియు కార్యాలయంలో మంగళవారం సిఐటియు, రైతు ఉపాధ్యాయ, ప్రజా సంఘాలు ఘనంగా సత్కరించాయి. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రజా వైద్యులుగా పేద బడుగు బలహీన వర్గాలకు ఎంతో సేవ చేశారని కొనియాడారు. వైద్యులుగా, జన విజ్ఞాన వేదిక నాయకులుగా ప్రజల్లో దాగి ఉన్న మూఢవిశ్వాసాలు అరాచకాలకు వ్యతిరేకంగా కృషి చేస్తున్నారని తెలిపారు. కరోనా సమయంలో సిపిఎం, సిఐటియు నిర్వహించిన కోవిడ్ సెంటర్లలో ప్రాణాలకు తెగించి వైద్య సహాయాన్ని అందించారన్నారు. అనేక వైద్య శిబిరాలను ఉచితంగా వైదం అందించారని తెలిపారు. ఇటువంటి వైద్యులు సమాజానికి ఎంతో అవసర మన్నారు. అనకాపల్లికి కూడా ఆయన వైద్య సేవలు విస్తరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్ శంకర్ రావు, జి కోటేశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.బాలకృష్ణ, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి, సిఐటియు నాయకులు వి.వి శ్రీనివాసరావు, జిఎంపిఎస్ జిల్లా అధ్యక్షులు గంట శ్రీరామ్, కే ఈశ్వరరావు, ఏ.రాజు, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వైఎల్.నర్సింగరావును సత్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

పూర్తిస్థాయి అధికారులను నియమించాలి


ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి నూతన జిల్లాగా ఏర్పడిన నేపథ్యంలో పూర్తిస్థాయి అధికారులను నియమించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిపిఐ నాయకులు కోన లక్ష్మణ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అనకాపల్లి ఎంపీడీవో ఇటీవల గుండెపోటుతో మరణించారని ఆయన స్థానంలో ఈవోఆర్‌డి ధర్మారావు ఇన్‌ఛార్జిగా ఉన్నారని, డిఎస్పీ సునీల్ సరెండర్ చేయడంతో ఆ పోస్టులో ఇన్‌ఛార్జి అధికారే ఉన్నారని తెలిపారు. పూర్తిస్థాయి అధికారులు లేకపోవడంతో ప్రజలకు సరైన న్యాయం జరగలేదన్నారు. తక్షణమే పూర్తి స్థాయి అధికారులను నియమించాలని కోరారు.

వేడుకగా ఎంవిఆర్ తనయుని వివాహం

ప్రజాశక్తి- అనకాపల్లి

ముత్యాల గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేత ముత్యాల వెంకటేశ్వరరావు తనయుడు రాజేష్ రమ్యల వివాహ మహోత్సవం అత్యంత వేడుకగా మంగళవారం నిర్వహించారు. స్థానిక మున్సిపల్ స్టేడియంలో జరిగిన వివాహ రిసెప్షన్ వేడుకలు పట్టణ ప్రజలకు కనువిందు చేశాయి. గుర్రాల రథంపై రాజేష్ రమ్యలు తరలిరాగా వారి ముందు వివిధ రకాల వాయిద్యాలు, భారీ బాణసంచా, పలు రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులచే నేల వేషాలు, పంజాబీ సన్నాయి మేళాలు, జబర్దస్త టీం ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. కనులు విరమెట్ల గోల్పే విద్యుదాలంకరణ పట్టణానికి శోభను తెచ్చిపెట్టాయి. వివాహ వేడుకలను తిలకించేందుకు ప్రముఖులు, పలు గ్రామాల నుంచి ప్రజలు నాయకులు తరలివచ్చారు.



వివాహ రిసెప్షన్‌లో నూతన వధూవరులు, ఎంవిఆర్ తదితరులు

ఆసరాతో మహిళలకు భరోసా

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : ఆసరా పథకం మహిళలకు గొప్ప భరోసా అని ఎలమంచిలి శాసనసభ్యులు యువి రమణ మూర్తి రాజు అన్నారు. స్థానిక నందీశ్వర ప్రాంగణం వేదికపై మంగళవారం డ్వాక్రా మహిళలకు మూడో విడత ఆసరా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళల ఉన్నతిని పెంపొందించే విధంగా వైయస్ జగన్మోహన్ రెడ్డి పరిపాలన కొనసాగుతుందన్నారు. మండలంలో 1262 పొదుపు సంఘాలకు గాను 13706 మంది సభ్యులకు రూ.10,25,97,598 మహిళల ఖాతాలో జమ చేయడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ యు సుకుమార్ వర్మ, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ బోడ్డేడ ప్రసాద్, జడ్పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, సర్పంచ్ దిమ్మల అప్పారావు, మండల వైసిపి కన్వీనర్ ఆడారి గణపతి అచ్చం నాయుడు, ఎంపీడీవో రవికుమార్, పాల్గొన్నారు.

రాంబిల్లి : మహిళా సంక్షేమ ధ్యేయంగా వైసిపి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ఎలమంచిలి ఎమ్మెల్యే యువి రమణ మూర్తి రాజు అన్నారు. వైఎస్ఆర్ అసరా పథకం 3వ విడతలో మంజూరైన అసరా నగదు ఎనిమిది కోట్ల 12 లక్షల రూపాయలు చెక్కులను మంగళవారం రాంబిల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి దూల నాగరాజు, ఎంపీపీ జి.శిరీష, వైస్ ఎంపీపీలు కోటపు లక్ష్మి, కాశిరెడ్డి నర్సింగ్ రావు, తహసీల్దారు పి భాగ్యవతి, వైసీపీ నాయకులు పి కిషోర్, జి శ్రీనుబాబు, రామకృష్ణ వెలుగు ఇన్చార్జి ఎపిఓ కోటి పాల్గొన్నారు.

గ్రంథాలయానికి కొత్త పుస్తకాలు

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం శాఖా గ్రంథాలయానికి 1298 కొత్త పుస్తకాలు అందుబాటులోకి వచ్చాయని గ్రంథాలయ అధికారి తిరుమల కుమారి తెలిపారు. గ్రంథాలయం మరమ్మతుల కోసం ఐదు లక్షల రూపాయలు నిధులు మంజూరైనట్లు వెల్లడించారు. కొత్తగా వచ్చిన పుస్తకాలను మంగళవారం స్థానిక పాఠకులు, విద్యార్థులు పరిశీలించారు. పోటీ పరీక్షలకు వెళుతున్న పాఠకుల కోరిక మేరకు రీడర్స్ ఆన్ డిమాండ్ పుస్తకాలు, తెలుగు అకాడమీ పుస్తకాలు, 6వ తరగతి నుండి 12వ తరగతి వరకు ఎన్సిఆర్టి పాఠ్యపుస్తకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వాటిని సరఫరా చేసిన విశాఖ జిల్లా గ్రంధాలయ సంస్థ ఛైర్పర్సన్ కొండా రమాదేవి, విశాఖ జిల్లా గ్రంధాలయ సంస్థ కార్యదర్శి ఆర్సిహెచ్ వెంకటరావుకు ధన్యవాదాలు తెలిపారు.

రోడ్డుపై సంత.. వాహనదారులకు ఇక్కట్లు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

బుచ్చయ్యపేట చెరుకు కాటా వద్ద ప్రతి బుధవారం జరుగు సంత వలన తరచూ ట్రాఫిక్ నిలిచిపోతుంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ప్రతి బుధవారం జరుగు ఈ సంతలో అధిక సంఖ్యలో కూరగాయల విక్రయాలు జరుగుతుంటాయి. మండలంలోని కందిపూడి పోలేపల్లి, కేపీ అగ్రహారం, కొండ పాలెం, దిబ్బిడి, గొన్నవానిపాలెం. పి భీమవరం, చిన్నప్పన్నపాలెం తదితర గ్రామాలకు చెందిన వారు ఈ సంతకు వచ్చి తమకు కావలసిన కూరగాయలు, పండ్లు, బట్టలు, మాంసం, చేపలు, ఇతర సరుకులను కొనుగోలు చేస్తుంటారు. ఈ సంత రోడ్డుపైనే జరుగుతుండడంతో రోడ్డుకు ఇరువైపులా వ్యాపారులు తమ వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. దీంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అరగంట, గంట వరకు వాహనాల రోడ్డుపై నిలిచిపోవడంతో ప్రయాణికులు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సంతను ప్రత్యామ్నాయంగా చెరకుకాటాలో ఏర్పాటు చేస్తే వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని పలువురు చెబుతున్నారు. చెరకు కాటా సీజన్ ముగిసిపోవడంతో ప్రస్తుతం చెరుకు కాటా స్థలం ఖాళీగా ఉంది. సదరు చెరుకు కాటా స్థలంలో కూరగాయల వ్యాపారులకు స్థలాలను చూపించి అమ్మకాలు సాగించినట్లయితే వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని ప్రయాణికులు తెలుపుతున్నారు.



వాహనాల రాకపోకలకు వీల్లేకుండా ఉన్న రహదారి (ఫైల్‌ఫొటో)

ప్రభుత్వ భూమిని కాజేయడానికి కుట్ర?

- పేదలకు పట్టాలు పేరిట వినతులు
- ఆర్మీ జవాన్లకు కట్టబెట్టడానికి రూ.లక్షలు చేతులు మారినట్లు ప్రచారం
- రాజాం, చిట్టియ్యపాలెం గ్రామాల మధ్య వివాదమవుతున్న 233 సర్వే నెంబర్‌లోని 40 ఎకరాల భూమి



పట్టాలివ్వాలని వినతి పత్రం అందజేస్తున్న రాజాం గ్రామస్తులు,



కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసిన పత్రాన్ని చూపుతున్న దృశ్యం

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట

బుచ్చయ్యపేట మండలం రాజాం గ్రామం 233 సర్వే నెంబర్‌లో గల సుమారు 40 ఎకరాలు భూమిని కాజేయడానికి కుట్ర జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎకరా రూ.40 లక్షల వరకు ధర పలుకుతున్న ఈ భూములు చేతులు మారడానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. జిల్లా కేంద్రానికి కేవలం 16 కిలోమీటర్ల దూరంలో, రాజాం-తట్టబంద తారు రోడ్డుకు ఆనుకొని ఉండటంతో రెవెన్యూ అధికారుల సహకారంతో రిటైర్ట్ ఆర్మీ జవాన్ల పేర ఈ భూమి ద్వారా సొమ్ము చేసుకోవడానికి అధికార వైసిపి నాయకులు రంగం సిద్ధం చేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

రాజాం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 233లో కొండ పోరంబోకు భూమి 40 ఎకరాలు ఉంది. రాజాం-తట్టబంద రోడ్డులో చిట్టియ్యపాలెం గ్రామం వరకు ఈ భూమి విస్తరించి ఉంది. ఈ భూమిలో 20 ఏళ్ల నుండి అటవీశాఖ ఆధ్వర్యాన చిట్టియ్యపాలెం గ్రామస్తులు సోషల్ ఫారెస్ట్ట సాగు చేస్తూ వచ్చే డబ్బులను గ్రామ అవసరాలకు ఉపయోగించుకుంటున్నారు.

అయితే ఈ భూములను రాజాం గ్రామంలోని భూమి లేని సుమారు 30 నుండి 40 కుటుంబాలకు కేటాయించి పట్టాలు మంజూరు చేయాలని ఆ గ్రామానికి చెందిన అధికార వైసిపి వారు కొంతకాలంగా విన్నవిస్తూ వస్తున్నారు. ఇదే విషయంపై ఈ నెల 27న సోమవారం కూడా రాజాం గ్రామ సర్పంచ్ మరిస నాని ఆధ్వర్యాన బుచ్చయ్యపేట తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

భూమిని కాజేసే కుట్ర అంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు

సర్వే నెంబర్ 233లోని 40 ఎకరాల భూమిని కాజేయడానికి కుట్ర జరుగుతుందంటూ రాజాం గ్రామం టిడిపికి చెందిన మాజీ ఎంపిటిసి మరిస సతీష్, మాజీ సర్పంచ్ ఎండపల్లి సత్యారావు, అధికార వైసిపికి చెందిన ఎంపిటిసి భర్త, మాజీ సర్పంచ్ మరిస చినరమణ ఈ నెల 27న సోమవారం అనకాపల్లి కలెక్టరేట్ స్పందనలో ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారుల సహకారాలతో రాజాంలోని కొద్ది మందికి పట్టాలు ఇచ్చి, మిగతా భూమిని ఎకరాకు రూ.2.50 లక్షలు చొప్పున తీసుకొని రిటైర్డ్ ఆర్మీ జవాన్లకు పట్టాలు ఇవ్వడానికి అధికార పార్టీకి చెందిన కొంత మంది రంగం సిద్ధం చేసినట్లు, ఈ వ్యవహారంలో ఇప్పటికే రూ.20 లక్షల వరకు చేతులు మారినట్లు వారు ఆరోపిస్తున్నారు. ఈ భూమిని గ్రామ అవసరాల నిమిత్తం సుమారు 60 ఏళ్లగా కాపాడుకుంటూ వస్తున్నామని, ఇప్పటికే హైస్కూల్ నిర్మించామని, కళాశాల, వసతి గృహాలు, నైపుణ్యాభివృద్ధి, ఆరోగ్య కేంద్రాలు వంటి వాటికి ఈ భూమిని ఉపయోగించాలని వీరు కోరుతున్నారు.

చిట్టియ్యపాలెం గ్రామస్తుల ఫిర్యాదు!

ఈ భూమిలో సోషల్ ఫారెస్టులో భాగంగా చిట్టియ్యపాలెం గ్రామస్తులు ప్రస్తుతం యూకలిప్టస్ తోటను సాగు చేశారు. ఈ భూమిని తమకు కేటాయించి పట్టాలు మంజూరు చేయాలని కోరుతున్న రాజాం గ్రామానికి చెందిన వారు సోమవారం యూకలిప్టస్ తోటను నరకడానికి ప్రయత్నించగా, చిట్టియ్యపాలెం గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ సమయంలో అక్కడ ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. దీంతో చిట్టయ్యపాలెం గ్రామస్తులు ఈ భూమిని తమ గ్రామంలోని పేదలకు పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం అనకాపల్లి జిల్లా కలెక్టరేట్ స్పందనలో వినతిపత్రం అందజేసినట్లు తెలిసింది.

ఒకే భూమి కోసం రాజాం, చిట్టియ్యపాలెం గ్రామస్తులు గొడవలు పడుతూ, తమకంటే.., తమకు కేటాయించాలని కోరుతూ వినవపత్రాలు ఇస్తుండగా, మరో వైపు రెవెన్యూ అధికారుల సహకారంతో లక్షలాది రూపాయలకు బేరం కుదుర్చుకొని ఈ భూమిని రిటైర్డ్ ఆర్మీ జవాన్లకు కట్టబెట్టేందుకు అధికార వైసిపి నాయకులు ప్రయత్నం చేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులు వెళ్లిన నేపథ్యంలో ఈ భూమిపై ఏమి జరుగుతుందో వేచి చూడాలి.



దెబ్బతిన్న టమాటా పంటను పరిశీలిస్తున్న లావణ్య

దెబ్బతిన్న ఉద్యానవన పంటలకు నష్టపరిహారం

ప్రజాశక్తి-అనకాపల్లి : ఇటీవల కురిసిన వర్షానికి అర్బన్ ప్రాంతంలో డెబ్బతిన్న ఉద్యానవన పంటలను మంగళవారం ఉద్యానవన శాఖ అధికారి లావణ్య క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దెబ్బతిన్న పంటను దృష్టిలో పెట్టుకుని నష్టపరిహారం రాయడం జరుగుతుందన్నారు. అనకాపల్లి సౌత్ టు, వల్లూరు రాజుపాలెం గొర్లివానిపాలెం గ్రామాల్లో ఉద్యానవన పంటలు దెబ్బతిన్న రైతుల నుంచి వన్ బి, ఆధార్ కార్డు, బ్యాంకు ఎకౌంటు జిరాక్స్ కాపీలను తీసుకొని వ్యవసాయ విస్తరణ అధికారుల పర్యవేక్షణలో నమోదు చేస్తామని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి గణేష్, వ్యవసాయ అసిస్టెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

హాకీ స్టేడియం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి

రాష్ట్రంలో అనకాపల్లి జిల్లా ఎలమంచిలి హాకీ క్రీడాకారులకు పుట్టినిల్లు వంటిదని, ఇక్కడ నుంచి అనేకమంది జాతీయ అంతర్జాతీయ క్రీడాకారులు తయారైన నేపథ్యంలో అంతర్జాతీయ స్థాయిలో ఇక్కడ హాకీ స్టేడియం నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బివి సత్యవతి యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ కోరారు. సరైన హాకీ గ్రౌండ్, మౌలిక సదుపాయాలు, కోచింగ్ సెంటర్ లేకపోవడంతో ఇక్కడ నుంచి క్రీడాకారులు హైదరాబాద్ వెళ్లి శిక్షణ పొందే వారని తెలిపారు.

బొజ్జన్న కొండ రహదారికి మోక్షం

ప్రసిద్ధ బౌద్ధ ఆరామ క్షేత్రం బొజ్జన్న కొండ రహదారి నిర్మాణానికి ఎంపీ లాడ్స్ నుంచి 40 లక్షల రూపాయలు ఎంపీ సత్యవతి మంజూరు చేశారు. ఈ మొత్తంతో రోడ్డుతో పాటు ఇరువైపులా వాకింగ్ ట్రాక్, పచ్చదనం కోసం మొక్కలు నాటడం జరుగుతుందని తెలిపారు. ఇందుకు సహకరించిన మంత్రి గుడివాడ అమర్నాథ్‌కు, జిల్లా కలెక్టర్ రవి పఠాన్‌శెట్టికి ఆమె ధన్యవాదాలు తెలియజేశారు.

టిడిపి ఆవిర్భావ దినోత్సవానికి తరలిరావాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : ఈనెల 29న హైదరాబాద్ నాంపల్లి గ్రౌండ్స్‌లో జరుగుతున్న తెలుగుదేశం పార్టీ 41వ ఆవిర్భావ దినోత్సవానికి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి రావాలని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ పార్టీ జెండా పండుగను గ్రామ గ్రామాన భారీగా నిర్వహించాలన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి విజయకేతనం ఎగురవేసి, పార్టీ జెండా రెపరెపలాడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మళ్ల సురేంద్ర, సబ్బవరపు గణేష్, పోలవరపు త్రినాథ్, కొణతాల శ్రీనివాసరావు, పచ్చికూర రాము, పల్లెల నాగేశ్వరరావు, రొంగలి సూరిబాబు, పోలిన జగ్గారావు, కరణం కోటి, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మశ్రీ సహకారంతో వడ్డాది జంక్షన్ అభివృద్ధి

ప్రజాశక్తి-వడ్డాది : స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ సహకారంతో వడ్డాది నాలుగు రోడ్ల కూడలి అభివృద్ధి చెందిందని పట్టణ వైసీపీ నేతలు దొండా నారాయణమూర్తి, దాడి సూర్య నాగేశ్వరరావు, దొండా సన్యాసిరావు, కోవెల జనార్ధన్‌రావు, కోరుకొండ సూరి అప్పారావు, ఇంటి అప్పారావు తెలిపారు. మురికి కూపంగా ఉన్న వడ్డాది జంక్షన్లో రోడ్లను రూ.72 లక్షలతో విస్తరించి రెండువైపులా డ్రైన్లు నిర్మిస్తున్నారని తెలిపారు. రూ.11 కోట్లతో పెద్దేరు వంతెన డైవర్షన్ రోడ్డు నిర్మిస్తున్నారని పేర్కొన్నారు. పెద్దేరు ప్రధాన వంతెన నిర్మాణానికి రూ.25 కోట్లతో ప్రతిపాదనలు పంపారన్నారు. రూ.32 కోట్లతో కేబి రోడ్డు విస్తరణ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయని తెలిపారు.



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

రబీ పంటలపై రైతులకు సూచనలివ్వాలి

ప్రజాశక్తి-సబ్బవరం : రబీ పంటలు సాగుపై రైతులకు సూచనలు ఇవ్వాలని స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ వ్యవసాయ అధికారులకు సూచించారు. ఇప్పటివరకు విశాఖపట్నం అగ్రికల్చరల్ సబ్ డివిజన్లో ఉన్న సబ్బవరం, పరవాడ మండలాలు ఇకపై అనకాపల్లి అగ్రికల్చర్ సబ్ డివిజన్లో చేర్చిన నేపథ్యంలో అనకాపల్లి వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.రామారావు మంగళవారం ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. సబ్బవరం, పరవాడ మండలంలో గల రబీ సీజన్‌కు సంబంధించి పంటల సరళిని, వ్యవసాయ యాంత్రీకరణ సంబంధించి కస్టమ్ హైరింగ్ సెంటర్ల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటూ, వారు అధిక దిగుబడులు సాధించేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ, వైసీపీ నాయకులు బోకం రాము నాయుడు, భగవాన్ జైరాం, బోను గంగనాయుడు, ఎడ్ల నాయుడు, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, ఎఈ ఓ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన నూకాంబిక ఆలయ ఇఒ

ప్రజాశక్తి-అనకాపల్లి : నూకంబిక అమ్మవారి ఆలయ కార్య నిర్వహణ అధికారిగా బాధ్యతలు చేపట్టిన బండారి ప్రసాద్ మంగళవారం రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి అమర్నాథ్ మాట్లాడుతూ కొత్త అమావాస్య జాతర సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మహిళాభ్యున్నతికి వైసిపి పెద్దపీట

ఆసరా చెక్కుల పంపిణీలో ఉపముఖ్యమంత్రి బూడి, ఎమ్మెల్యే గణేష్


మాడుగులలో ఆసరా చెక్కు అందజేస్తున్న ఉపముఖ్యమంత్రి బూడి

ప్రజాశక్తి - మాడుగుల : మహిళలకు ఆర్థిక ఆసరా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. మంగళవారం మాడుగులలో ఆసరా చెక్కు పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతూ మహిళల ద్వారా పురోభివృద్ధి సాధ్యమని ముఖ్యమంత్రి జగన్ నమ్మారని, అందుకే మహిళల ఆర్థికస్వావలంబనకు వివిధ పథకాలు అందిస్తున్నారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ ముఖ్యమంత్రి జగన్ నెరవేరుస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపిపి పెదబాబు, వైస్ ఎంపిపి రాజారామ్ శ్రీనివాస్, జెడ్‌పిటిసి రమణమ్మ, ఎంపిడిఒ కుమారి పాల్గొన్నారు

నర్సీపట్నం టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తోందని స్థానిక ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో మహిళలకు జగనన్న ఆసరా ఆర్థికసాయాన్ని పంపిణీ చేశారు ముందుగా స్టేడియంలోని జాతిపిత మహాత్మా గాంధీకి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు మహిళలకు వైఎస్సార్ ఆసరా ద్వారా ఆర్థిక భరోసాను ముఖ్యమంత్రి జగన్ కల్పించారని, పార్టీలకతీతంగా మహిళలందరూ లబ్ధి చేకూర్చడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు.

నియోజకవర్గంలోని నర్సీపట్నం, గొలుగొండ, మాకవరపాలెం, నాతవరం మండలాల్లోని 989 సంఘాల్లోని డ్వాక్రా మహిళలకు మూడో విడత ఆసరా సాయం కింద రూ.118.86 కోట్ల లబ్ధి అందజేస్తున్నట్లు వెల్లడించారు.. మండల పరిషత్ కార్యాలయంలో స్వయం ఉపాధి పొందుతున్న డ్వాక్రా మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. ఎన్‌టిఆర్ మినీ స్టేడియంలో నర్సీపట్నం మండలానికి సంబంధించిన చెక్కును మున్సిపల్ చైర్‌పర్సన్ ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి సుర్ల రాజేశ్వరి శేఖర్, ఎంపిడిఒ జయమాధవి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు కన్నయ్యనాయుడు, వైస్ ఎంపిపి ఇన్నం రత్నంరమణ, సర్పంచ్ చిన్నబాబు, పార్టీ అధ్యక్షులు పసుపులేటి రమణమ్మ ఎపిఎం పార్వతీభాయి, ఏరియా కోఆర్డినేటర్ సత్యనారాయణ పాల్గొన్నారు.


నర్సీపట్నంలో చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్

రీ సర్వే వేగవంతం చేయాలి : ఆర్‌డిఒ


సూచనలు చేస్తున్న ఆర్‌డిఒ జయరాం

ప్రజాశక్తి-గొలుగొండ : సమగ్ర భూరీ సర్వే పనులను వేగవంతం చేయాలని నర్సీపట్నం ఆర్‌డిఒ హెచ్‌వి.జయరాం అధికారులను ఆదేశించారు. మంగళవారం గొలుగొండ మండలం పుత్తడి గైరంపేట పంచాయతీ శివారు ప్రల్లవు నాగేంద్రపాలెం గ్రామంలో జరుగుతున్న రీసర్వే పనులను పరిశీలించారు. ఈ రీ సర్వేను వేగవంతం చేస్తూ రైతుల అపోహలను తొలగించాలన్నారు. ఆయన వెంట తహశీల్దార్ ఆనంద్, ఆర్ఐతో పాటు సర్పంచ్ పత్తి రమణ పాల్గొన్నారు.

కోడిపందేల శిబిరంపై దాడి

ప్రజాశక్తి - నక్కపల్లి: మండలంలోని నెల్లిపూడి వద్ద కోడిపందేల శిబిరంపై మంగళవారం దాడి చేసినట్లు ఎస్‌ఐ శిరీష తెలిపారు. ఈ దాడుల్లో కోడిపందేలు ఆడుతున్న ఇరువురు జూదరులను అరెస్టు చేసి, వారి నుంచి నాలుగు కోళ్లు, రూ.800 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

ముగ్గురు గంజాయి నిందితుల అరెస్టు

ప్రజాశక్తి -కశింకోట : కశింకోట పోలీసుస్టేషన్ వద్ద లారీలో బియ్యం బస్తాల మాటున 890 కేజీలు గంజాయిని తరలిస్తుండగా పట్టుబడిన కేసులో పరారీలో ఉన్న నిందితులను అనకాపల్లి ఆర్‌టిసి బస్సు స్టాండ్‌లో సిఐ, రవికుమార్, ఎస్ ఐ ఆదినారాయణరెడ్డి మంగళవారం పట్టుకున్నారు. నిందితుల్లో అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం లింగేటి గ్రామానికి చెందిన కొంతా సుధాకర్ ఉరఫ్ సుధీర్, ముంచంగిపుట్టు మండలం గుత్తలమండ గ్రామానికి చెందిన వంతల భగవాన్, జార్ఖండ్ రాష్ట్రంలో విష్ణుపులి గ్రామానికి చెందిన బబ్లూకుమార్ యాదవ్‌లను అనకాపల్లి రూరల్ పోలీసులు పట్టుకుని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితులు ధర్మేంద్ర గుప్తా, కిల్లో వాసుదేవ్, చందన గుప్తాలతో పాటు మరికొంత మంది పరారీలో ఉన్నారు

ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలి


ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ చంద్రశేఖర్

ప్రజాశక్తి కోటవురట్ల: గ్రామ సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకుని, ప్రతిఒక్కరూ ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవాలని ఎంపిడిఒ చంద్రశేఖర్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని సచివాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ కేంద్రాన్ని సందర్శించారు. వివిధ ప్రభుత్వ పథకాలు సహా బ్యాంకు లావాదేవీలు, ఇతరత్రా అవసరాలకు ఆధార్‌ను తప్పనిసరి చేస్తున్న పరిస్థితుల్లో ప్రతిఒక్కరూ ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో జూలై 14వరకు ఉచితంగా అప్‌డేట్ చేసుకోవచ్చని, ఆధార్ కేంద్రాల్లో నిర్దేశిత రుసుము చెల్లించి అప్‌డేట్ చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్‌పర్సన్ మార్పు జరిగేనా..?

రెండేళ్ల క్రితంనాటి ఒప్పందం అమలుపై ఉత్కంఠ... మున్సిపాలిటీలో సర్వత్రా దీనిపైనే చర్చ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : ఎన్నికల సమయంలో జరిగిన లోపాయికారీ ఒప్పందం మేరకు నర్సీపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ మార్పుపై సర్వత్రా చర్చ జరుగుతోంది. మున్సిపల్ ఎన్నికల జరిగేటప్పుడు ఎస్‌సి మహిళలకు కేటాయించిన చైర్‌పర్సన్ పదవిని అప్పట్లో గుడబండి ఆదిలక్ష్మికి వరించింది. మున్సిపల్ కౌన్సిల్‌లో మెజార్టీ స్థానాలను గెలుచుకున్న వైసిపిలో అప్పట్లో చైర్‌పర్సన్ పదవిని ఎవరికి కట్టబెట్టాలనే అంశంపై చర్చల అనంతరం వంతులవారీగా ఇద్దరికి ఇవ్వాలని అప్పట్లో నిర్ణయించారు. ఈ మేరకు తొలి రెండేళ్లపాటు గుడిబండ ఆదిలక్ష్మి చైర్‌పర్సన్‌గా బాధ్యతలను స్వీకరించారు. అప్పట్లో అనుకున్న ప్రకారం ఆమె పదవీకాలం ఈనెల 18తో ముగియనుంది. కొత్తచైర్‌పర్సన్‌గా బోడపాటి సుబ్బలక్ష్మికి బాధ్యతలను అప్పగించి, ఆదిలక్ష్మి పదవి నుంచి తప్పుకోవాల్సి ఉంది.

అయితే ఇపుడు అది జరిగేనా అని చర్చ సాగుతోంది. నూతన పాలకవర్గంతోపాటు మున్సిపల్ చైర్‌పర్సన్ మార్పుపై పార్టీ పెద్దలంతా ప్రస్తుత చైర్‌పర్సన్ ఆదిలక్ష్మితో చర్చలు జరిపినట్లు సమాచారం. అయితే పదవి నుంచి తప్పుకోవడానికి ఆమె సుముఖంగా లేనట్లు సమాచారం. దీనిపై నిర్ణయం తీసుకునేందుకు గతనెలలోనే సమావేశాన్ని నిర్వహించాలని భావించినా అపుడది వాయిదా పడింది. బుధవారం మున్సిపల్ సాధారణ సమావేశాలు నిర్వహించాలని భావిస్తున్నట్లు మున్సిపల్ అధికారులు అంటున్నా, అది జరిగినంత వరకు అనుమానమే. సమావేశం జరపాలంటే ముందుగా అజెండా ఖరారుచేసుకుని, సభ్యులు, అధికారులకు సమాచారమిచ్చి నిర్వహించాలి, అటువంటివేవీ లేకపోవడంతో బుధవారం సమావేశం ఊహాగానమేనని అంటున్నారు.

అసలు మున్సిపల్ సమావేశం జరుగుతుందా, జరిగితే సమావేశానికి ఆదిలక్ష్మి వస్తారా? చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేస్తారా? అన్నీ ప్రశ్నలే. కాగా పార్టీలో కొంతమంది తనకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తూ మనసుకు ఇబ్బంది కలిగిస్తున్నారని, మానసికంగా క్షోభకు గురిచేస్తున్నారని ఇటీవల చైర్‌పర్సన్ ఆదిలక్ష్మి వెల్లడించిన విషయం తెలిసిందే మంగళవారం మున్సిపాలిటీ కార్యాలయం వద్ద నిర్వహించిన జగనన్న ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆమె హాజరు కాకపోవడం ఒకింత అనుమానాలకు తావిస్తున్నాయి.

భూముల రిజిస్ట్రేషన్‌పై శిక్షణ


శిక్షణ ఇస్తున్న సబ్ రిజిస్ట్రార్ బేగం

ప్రజాశక్తి నక్కపల్లి: నక్కపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్లకు భూముల రిజిస్ట్రేషన్‌పై శిక్షణ ఇచ్చారు. త్వరలో సచివాలయాల్లో భూముల రిజిస్ట్రేషన్ సేవలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు మండలంలో జగన్నాధపురం, గొడిచెర్ల, సిహెచ్‌బి అగ్రహారం, రాజయ్యపేట పంచాయతీల కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు సబ్ రిజిస్ట్రార్ బేగం శిక్షణ ఇచ్చారు. రిజిస్ట్రేషన్లు ఎలా చేయాలి తదితర అంశాలపై అవగాహన కల్పించారు

విజయవంతంగా నూకాలమ్మ తీర్థం


సన్మానిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలో లింగంపేట నూకాలమ్మ తీర్థ మహోత్సవాలను దిగ్విజయంగా నిర్వహించడానికి ముఖ్య కారకులైన ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ బొండల నూకరత్నం, రాష్ట్ర బిసి కార్పొరేషన్ డైరెక్టర్ బొండల రాజులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సంతోష్‌కుమార్, వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షులు పి.మంగరాజు, కార్యక్రమ నిర్వాహకులు చేబ్రోలు మల్లేశ్వరరావు, మరిసా సత్యనారాయణ, కొరుప్రోలు దొరబాబు, స్థానిక ఆర్ఎంపీ వైద్యులు ఈశ్వరరావు పాల్గొన్నారు.

పటిష్టంగా పోషణ్ పక్వాడ అమలు

ప్రజాశక్తి -కోటవురట్ల : గ్రామీణ ప్రాంతాలలో గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అమలు చేస్తున్న పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించాలని ఎంపిడిఒ చంద్రశేఖర్ సూచించారు. మంగళవారం టిడిపి కార్యాలయం వద్ద అంగన్వాడీ సిబ్బంది ఏర్పాటుచేసిన పోషణ్ పక్వాడా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలకు అందజేస్తున్న పోషకాహారాన్ని క్రమం తప్పకుండా లబ్ధిదారులకు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, గ్రామ కార్యదర్శి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

గర్భిణీలకు, బాలింతలకు అవగాహన

గొలుగొండ : పోషణ పక్వాడాలో భాగంగా మండలంలోని ఏఎల్‌పురం అంగన్వాడీ-4 కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై కెడిపేట పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ హరిప్రవీణ్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రక్తహీనతను అధిగమించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సిహెచ్‌ఒ లక్ష్మీభవానీ, ఏఎన్ఎం మాణిక్యం, అంగన్వాడీ కార్యకర్తలు మంగతాయి,


గొలుగొండలో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ హరిప్రవీణ్

విజయకుమారి, ఆశాలు వరలక్ష్మీ, లక్ష్మీ, నూకరత్నం, మహిళా పోలీసు లక్ష్మి పాల్గొన్నారు.

రక్తహీనతపై కిశోర్ బాలికలకు అవగాహన

గొలుగొండ మండలం ఏఎల్‌పురంలో గ్రామంలో కిశోర్ బాలికలకు రక్తహీనతపై మంగళవారం ఏఎల్‌పురం అంగన్వాడీ సెంటర్-4 కార్యకర్త ఎం.మంగతాయి అవగాహన కల్పించారు. రక్తహీనతకు గురికాకుండా తగు జాగ్రత్తలు పాటిస్తూ పోషకాహారం తీసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో మహిళా పోలీస్ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ నిరసన

ప్రజాశక్తి -డుంబ్రిగూడ: బోయ/వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్పించి, నిజమైన గిరిజనులకు అన్యాయం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 29న మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద న్యాయ పోరాట నిరాహార దీక్ష చేపడుతున్నట్లు కాంగ్రెస్ రాష్ట్ర ఆదివాసీ చైర్‌పర్సన్, రాష్ట్ర కార్యదర్శి పి శాంతకుమారి అన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గిరిజన వ్యతిరేక విధానాలను అవలంబిస్తూనే ఉందన్నారు. బోయ/వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేరుస్తూ, కేబినెట్‌లో తీర్మానం చేస్తే, ఏడుగురు వైసిపి ఎమ్మెల్యేలు సహకరించడం దుర్మార్గమన్నారు.

కళాశాల సమస్యలపై వినతి



ఉపముఖ్యమంత్రిని కలిసి విన్నవిస్తున్న డిగ్రీ కాలేజీ అధ్యాపకులు

ప్రజాశక్తి- మాడుగుల : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలేజీ అధ్యాపక బృందం మంగళవారం ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడును కలిసి విన్నవించారు. కళాశాల ప్రిన్సిపాల్ శాస్త్రి ఆధ్వర్యంలో అధ్యాపకులంతా మంత్రిని కలిసి కళాశాలలో తరగతి గదులు, ఇతర సమస్యలు పేరుకుపోయి ఉన్నాయన్నారు. దీనిపై తగు చర్యలు తీసుకుని పరిష్కరించాలని కోరారు. దీనిపై ఉపముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి, త్వరలో అన్ని సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జయలక్ష్మి, ఇతర అధ్యాపకులు షర్మిల, ఐడి రాజు, బి రాజు సులోచన, రామ్‌కుమార్ పాల్గొన్నారు

పాఠశాలకు హెటిరో వితరణ

బాలికల ఉన్నత పాఠశాలకు వంటసామగ్రి



వంట సామగ్రి అందజేస్తున్న హెటిరో కంపెనీ ప్రతినిధులు

ప్రజాశక్తి -నక్కపల్లి : స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు హెటిరో డ్రగ్స్ కంపెనీ సౌజన్యంతో మంగళవారం వంట సామగ్రిని అందజేశారు మంగళవారం ప్రధానోపాధ్యాయురాలు పుష్యరాగం సమక్షంలో . కంపెనీ ప్రతినిధులు ఎం సుబ్బారెడ్డి, ఎస్ కుల్లాయిరెడ్డి పాల్గొని, మధ్యాహ్న భోజనం పథకం నిర్వాహకులకు వంట సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ కంపెనీ సిఎస్ఆర్ నిధులు రూ.లక్ష విలువైన గ్రైండర్, మిక్సీ, పెద్ద గ్యాస్ స్టవ్, ఇతర వంట సామగ్రిని అందజేశామన్నారు. ఇదివరకే హెటిరో సౌజన్యంతోనే బాలుర హైస్కూల్‌కు కూడా సామాగ్రిని ఇచ్చామన్నారు. సిఎస్ఆర్ నిధులతో అనేక అభివృద్ధి, సేవా కార్యక్రమాలను హెటిరో కంపెనీ యాజమాన్యం చేపడుతోందన్నారు. కార్యక్రమంలో కంపెనీ సిబ్బంది శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏడాదిగా అందని వేతనాలు

పారిశుధ్య కార్మికుల అవస్థలు



కాలువలు శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలో పారిశుద్ధ్య కార్మికుల పరిస్థితి దయనీయంగా మారింది. ఏడాది నుండి వారికి జీతాలు రాక అనేక ఇబ్బందులు పడుతున్నారు. తెల్లవారుజాము నుంచే వీధుల్లో చెత్తను ఊడ్చి తరలించే వీరికి జీతాలు పడకపోతే ఇంట్లో కుటుంబ పోషణ ఎలా? అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీతాలు రాకపోయినా పని చేస్తున్నామని, ఇప్పటికైనా అధికారులు స్పందించి జీతాలు ఇవ్వాలని వారు కోరుతున్నారు.

అపారిశుధ్యంతో అవస్థలు

- పూడుకుపోయిన డ్రైనేజీలు ... రోడ్లపైనే మురుగునీరు
- విజృంభిస్తున్న దోమలు.. స్వైరవిహారం చేస్తున్న పందులు
- అవస్థలు పడుతున్న ప్రజలు.. పట్టించుకోని అధికారులు



వెంకునాయుడుపేటలో పూడుకుపోయిన మురుగు కాలువ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం మున్సిపాలిటీలో అపారిశుధ్యం తాండవిస్తోంది. పట్టణంలో ఏ వీధికి, ఏ మూలకు వెళ్లినా రోడ్లపై పరుగులెడుతున్న మురుగునీరు, పూడుకుపోయిన డ్రైనేజీలు, రోడ్డు మధ్యలో నీటి గుంటల బురదతో పందుల స్వైరవిహారం సర్వసాదారణ దృశ్యాలుగా మారిపోయాయని పట్టణ ప్రజలు ఆవేదన చెందుతున్నారు. మున్సిపాలిటీ అధికారులు పారిశుధ్య నిర్వహణను పూర్తిగా మరిచిపోయారా అని ప్రశ్నిస్తున్నారు. ప్రజలు, ప్రతిపక్షాలు మొరపెట్టుకున్నా, విమర్శించినా పట్టించుకునే పరిస్థితి లేదు. అధికార పార్టీ నేతలు, కౌన్సిలర్లకు పట్టణ ప్రజల సమస్యలుగానీ, అపారిశుధ్యంతో పడే అవస్థలు, దోమలు, పందులు బెడద, రోగాల సమస్యలు వంటి వాటిని పట్టించుకునే చిత్తశుద్ధి లేదని వ ట్ట ణ వా న ం లు ఆరోపిస్తున్నారు.

మున్సిపాలిటీలో ప్రజా సమస్యల పరిష్కారానికి, సౌకర్యాల కల్పనకు, అభివృద్ధి పనులకు కోట్లల్లో నిధులు వెచ్చిస్తున్నామని



తహశీల్దార్ కార్యాలయం వద్ద పందుల స్వైరవిహారం



సిబిఎం కాంపౌండ్ వద్ద శిథిలమైన కల్వర్టు

కౌన్సిల్ సమావేశాల్లో చేస్తున్న ప్రకటనలకు, పట్టణంలో వాస్తవ పరిస్థితులకు ఎక్కడా పొంతన లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. పారిశుధ్యం మెరుగుపరచడం లేదని, కాలువలు ఉప్పొంగి రోడ్లపైనే మురుగునీరు ప్రవహిస్తున్నప్పటికీ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలున్నాయి. దీంతో పట్టణం నలుమూలలా పారిశు ధ్యం పూర్తిగా క్షీణించి, దోమలు, ఈగలు విజృంభిస్తున్నాయని ఆవేదన చెందుతున్నారు. నీరు కలుషితమైపోయి డెంగీ, మలేరియా, టైఫాయిడ్‌తో పాటు సీజనల్ వైరల్ జ్వరాలు వ్యాపిస్తున్నా పట్టించుకునే దిక్కులేదు. వాలంటీర్లు, సచివాలయ సిబ్బందికి, మున్సిపల్ సిబ్బందికి పన్నుల వసూలు, ఇతరత్రా వ్యవహారలపై ఉన్న శ్రద్ధ పట్టణ పారిశుధ్యంపై ఇసుమంతైనా పెట్టిన పాపాన పోలేదని అంటున్నారు.

పట్టణంలో శారదానగర్, ప్రశాంతి నగర్, వెంకునాయుడు పేట, శివపురం పీనారిపాలెం ప్రాంతాల్లో అధ్వానంగా ఉన్న పారిశుధ్యంపై ప్రజలు గగ్గోలు పెడుతున్నా పట్టించుకునే దిక్కులేదు. రామారావు పేటలో మురుగుకాలువలు పూడుకుపోయి, రోడ్డుపైనే మురుగునీరు ప్రవహిస్తూ అధ్వానంగా మారినా చర్యల్లేవు. కల్వర్టులు కూలిపోయి రాకపోకలకు అంతరాయం కలుగుతున్నా స్పందన లేదు. 26వ వార్డులో సిబిఎం కాంపౌండ్ వద్ద కల్వర్టు కూలిపోయి ఆరు నెలలు అవుతున్నప్పటికీ అధికారుల్లో కదలిక లేవు. మరోవైపు వీధుల్లో పందులు, కుక్కలు గుంపులుగా స్వైరవిహారం చేస్తూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నా మున్సిపల్ యంత్రాంగానికి పట్టని పరిస్థితి. కుక్క కాటుకు గురై ఆసుపత్రులు పాలైన ఘటనలు అనేక చోటుచేసుకున్నా చర్యల్లేవు. ఇప్పటికైనా మున్సిపల్ యంత్రాంగం స్పందించి, ప్రజారోగ్యాన్ని పరిగణనలోకి తీసుకుని పట్టణంలో పారిశు ధ్య సమస్యలపై దృష్టిపెట్టాలని కోరుతున్నారు.

జలజీవన్ మిషన్ పనులతో గ్రామీణ రహదారులు అస్తవ్యస్తం



సరిగా పూడ్చని పైపులైన్ గోతులను పరిశీలిస్తున్న హరిబాబు

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల కేంద్రంలో ప్రభుత్వం చేపడుతున్న జలజీవన్ మిషన్ పనులతో గ్రామీణ ప్రాంతాలలో రహదారులన్నీ అస్తవ్యస్తంగా తయారయ్యాయని ఆయా ప్రాంత నాయకులు ప్రజలు తీవ్ర అసహనం, అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం దీనిపై పనులను పర్యవేక్షిస్తున్న ఆర్‌డబ్ల్యుఎస్ అధికారిని, గ్రామకార్యదర్శినివార్డు సభ్యులు జానకి హరిబాబు ప్రశ్నించారు, జలజీవన్ పనుల్లో భాగంగా ఇంటింటికి కుళాయి పేరుతో చేపడుతున్న పనుల కారణంగా గ్రామీణ రహదారులన్నీ పూర్తిగా ధ్వంసం చేసి వదిలేస్తున్నారని, కుళాయిపైపులైనులకు వేసిన గోతులను సరిగా పూడ్చక, పూర్వపు మాదిరిగా సరిచేయకపోవడంతో తీవ్ర అవస్థలు పడాల్సి వస్తుందని ప్రజలు అంటున్నారు. రాత్రి సమయంలో వద్ధులు, వికలాంగులు, చిన్నపిల్లలతోపాటు వాహనదారులు వీధుల్లోకి వచ్చే పరిస్థితి లేదని ఆవేదన చెందుతున్నారు.

జలజీవన్ మిషన్ పనుల కోసం ఆరునెలలుగా చేపడుతున్న పనులతో అటు ఇంటింటికీ కుళాయిల ద్వారా నీరు ఇవ్వకపోగా, ఇలా గ్రామీణ రోడ్లను అస్తవ్యస్తం చేసి ప్రజలను అవస్థలకు గురిచేయడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

దీనిపై గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇంజనీర్ కరుణను వివరణ కోరగా గ్రామీణ ప్రాంతాల్లో నిర్మిస్తున్న జలజీవన్ మిషన్ పనులు దాదాపు పూర్తికావస్తున్నాయని, పనులు పూర్తయిన తర్వాత ట్రయల్ రన్ నిర్వహించి అప్పుడు గుంతలు పూడుస్తామన్నారు. ట్రయల్ రన్ నిర్వహించకుండా గుంతలను పూడ్చినట్లయితే లీకేజీలు అరికట్టడం ఇబ్బంది అవుతుందని, మళ్లీ గోతులు తీయాల్సి వస్తుందన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి ప్రహరీ నిర్మించాలి



ఎర్రవరం అంగన్వాడీ కేంద్రం

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని ఎర్రవరం అంగన్వాడీ కేంద్రానికి ప్రహరీ లేక పిల్లలు, తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. కేంద్రం చుట్టూ జీడి మామిడి తోటలు, పిచ్చి మొక్కలు అధికంగా ఉండడంతో విషసర్పాలు, విషపురుగులు ఎక్కువగా తిరుగుతున్నాయని అంగన్వాడీ టీచర్ భ్రమరాంబ, విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిల్లల భద్రత, వారి ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకుని, తక్షణమే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రహరీ మంజూరు చేయించాలని కోరుతున్నారు.

పాఠశాల గ్రంథాలయం నిర్వహణపై సంతృప్తి

ప్రజాశక్తి -నక్కపల్లి : నక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పాఠశాల గ్రంథాలయాన్ని సమగ్రశిక్షా (విజయవాడ) రాష్ట్ర అధికారులు పి.సుజని, ఎమ్.అభిజిత్ మంగళవారం సందర్శించారు. గ్రంథాలయ స్టాక్ రిజిస్టర్, ఇతర వివరాలను హెచ్ఎం రాణిలలిత ఆధ్వర్యంలో గ్రంథాలయ నిర్వాహకులు, తెలుగు ఉపాధ్యాయుడు ఎన్‌విఎస్.ఆచార్యులును అడిగి తెలుసుకోవడంతోపాటు రికార్డులను పరిశీలించారు.

గ్రంథాలయాన్ని ప్రతిరోజూ ఎంతమంది విద్యార్థులు వినియోగిస్తున్నారో వాకబు చేశారు. తెలుగుతో పాటు ఇంగ్లీషు పుస్తకాలను కూడా విద్యార్థులు చదువుతుండడాన్ని పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రంథాలయ నిర్వహణపై సంతృప్తి వ్యక్తంచేసి, ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టివి.రమణ,ఉన్నారు.



గ్రంథాలయంలో పుస్తకాలను పరిశీలిస్తున్న రాష్ట్ర అధికారులు